Telugu

నెలవంక

www.nelavankaonline.com البشرى

సఫర్ హిజ్రీ శకం 1434 - Vol 9, Issue: 75 January 2013 مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى



గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు!

2013 January.indd 1 1/2/13 3:41 PM



శిష్ట రక్షణ కోసం దుష్ట శిక్షణ

మానవత్వం తల దించుకునేలా అత్యంత పాశవికంగా ఢిల్లీలో డిశంబరు 16న మెడికల్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన దేశానికే తలవంపు. నిరసనగా వేల సంఖ్యలో తరలి వచ్చిన జన సంద్రం విజయ్ చౌక్‌లో దిక్కులు పిక్కటిల్లేలా ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రశ్నించింది. సభ్య సమాజం హడలెత్తి పోయేలా జరిగిన అత్యాచార ఘటనకు ప్రభుత్వం సంజాయిషీ ఇవ్వాలంటూ పట్టు బట్టింది. ఉదయం నుండి అర్ధ రాత్రి వరకు సాగిన ఈ నిరసన దేశ చరిత్రలోనే ఓ కొత్త అధ్యాయానికి తెర లేపింది. ఎలాంటి రాజకీయ నేతృత్వం లేకుండానే తరలి వచ్చిన ఈ యువసేన అక్షరాలనే ఆయుధాలుగా ప్రయోగించారు. తూటాల్లాంటి మాటలతో సభ్యత మరచిన సమాజానికి బుద్ధి చెప్పే ప్రయత్నం చేశారు. తప్పు చేసిన వారిని ఎలా శిక్షించాలో సూచించారు. **'కామాంధుల్ని నిర్వీర్యుల్ని చేసి బహిరంగంగా ఉరి తీయాల'**ని కొందరంటే, **'ముక్కలుగా నరికి కుక్కలకు ఆహారంగా వేయాల'**న్నారు ఇంకొందరు. చివరికి దేశ రాజధానిలో సామూహిక అత్యాచారానికి గురై సింగపూర్‌లోని మౌంట్ ఎలిజబెత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాధితురాలు మృతి చెందింది. ఈ నేపథ్యంలో – మనిషి మనో భావాల్ని అతనికన్నా బాగా ఎరిగిన ఆ సర్వేశ్వరుడు కూడా ఇటువంటి వారిని ఇత రులకు గుణపాఠంగా నిలిచేలా కఠినంగా శిక్షించాలనే అంటు న్నాడు. అంటే మానవ శాసనం వల్ల సాధ్యం కానిది దైవ శాసనం వల్ల సాధ్యమవుతుంది. కాబట్టి మనిషి తన కృత్రిమ, కుత్సిత శాసనాలకు తిలోదకాలిచ్చి దైవశాసనాలకు హారతి పట్టిన నాడే ప్రతి జీవి ప్రశాంతంగా జీవించగలుగుతుంది.



"ఎవరు అల్లాహ్‌తోనూ, ఆయన ప్రవక్తతోనూ పోరాడుతారో, భూమిలో కల్లోలాన్ని రేకెత్తిస్తూ తిరుగుతుంటారో వారు వధించబడాలి. లేదా ఉరికంబం ఎక్కించబడాలి. లేదా ఎదురుగా వారి కాళ్లు చేతులు ఖండించ బడాలి. లేదా వారిని దేశం నుంచి బహిష్కరించాలి. ఇది ఇహలోకంలో వారికి కలగవలసిన పరాభవం. పరలోకంలో వారికి విధించబడే శిక్ష (ఇంతకన్నా) ఘోరంగా ఉంటుంది". (దివ్యఖుర్‌ఆన్ -5: 33)

వెలుగు

(AL-HILAL MONTHLY)

Vol 9, ISSUE: 73

January - 2013

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

EXECUTIVE EDITOR
Sk. Abdul Qadir Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
sk. Mohaamad Bilal
sk. Mohammad Saleem Jamaee

PHONE
Syed Abdus Salam Omeri
97266676

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE

Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency

www.zukhruf.net



2



4



10



14



సయ్యద్ అబ్దుస్సలామ్ ఉమ్రి
syed.abdussalam9@gmail.com

మానవత్వాన్ని కాపాడుకుందాం!

పాలస్తీనా విభజనకు నోచి పలికిన నవంబరు 29వ తేదీనే సరిగ్గా 65 సంవత్సరాలకు ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా గుర్తింపులో మరో ముందడుగు పడటం హర్షణీయం. స్వతంత్ర పాలస్తీనా ఆవిర్భావాన్ని అడ్డుకుంటున్న అగ్ర సామ్రాజ్య వాదులకు, ఇజ్రాయిల్‌కు ఐక్యరాజ్య సమితి సాధారణంగా అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం రాజకీయంగా, దౌత్య పరంగా చెంప పెట్టనే చెప్పాలి. ఈ తీర్మానాన్ని వ్యతిరేకించిన వాటిలో ఇజ్రాయిల్‌తో చేతులు కలిపిన ధనిక దేశాలు కొన్ని ఉన్నప్పటికీ పెద్ద దేశం కెనడా ఒక్కటే. మిగిలిన ఆరు మన కేంద్ర పాలిత ప్రాంతాల వంటివే. ఈ తీర్మానం ద్వారా ఇప్పటి వరకూ 'శాశ్వత పలిశీలక సంస్థ'గా ఉన్న పాలస్తీనా ఇప్పుడు 'సభ్యత్వం లేని పలిశీలక దేశ' హోదాను పొందింది.

తొలిసారిగా ఐరాస భవనంపై పాలస్తీనా పతాకం రెపరెపలాడగా పాలస్తీనా ప్రాంతంలో ప్రజల సంబరాలు అంబరాన్నంటాయి. ప్రపంచ శాంతి కాముకులు ఎంతో కాలంగా కోరుకుంటున్న పరిణామంలో ఓ ప్రారంభం ఇది. అయితే ఈ తీర్మానంతో పాలస్తీనాకు పూర్తి స్వాతంత్ర్యం వచ్చేసిందనుకోవడం తప్పులో కాలేయడమే అవుతుంది. ఈ సందర్భంగా **'గురుతరం నాటి తీర్మానం దురదృష్టకరం, వ్యతిరేక ఫలితాలనిస్తుందంటూ, ఈ రోజు గొప్పగా చేసిన ప్రసంగాలు రేపటికి ఉండవు, పాలస్తీనియన్లు రేపు నిద్ర మేల్కొనేటప్పటికే వారి జీవితాల్లో ఎలాంటి మార్పు ఉండకపోగా, శాంతి అవకాశాలు మరింత క్షీణించే ప్రమాద ముందని'** అమెరికా రాయబారి ప్రకటించడం వారి కుటిల నీతికి నిలువుటద్దం. ఏది ఏమయినా, ఎవరు కాదన్నా, అవునన్నా దాదాపు 132 దేశాలు స్వతంత్ర పాలస్తీనాను గుర్తించాయి. వాటిలో మన దేశం కూడా ఒకటి.



మొత్తే, పూర్వపరాల చరిత్ర తెరలను కాస్త తిరగేస్తే, గత ఆరున్నర దశాబ్దాలుగా - పాలస్తీనా స్వతంత్ర రాజ్య ఏర్పాటు అగ్రరాజ్యాలకు సుతరామూ ఇష్టం లేదన్నది స్పష్టం. పాలస్తీనా భూభాగాలను కయుక్తులతో, కుసంస్కృతితో ఆక్రమించి తల దాచుకునేందుకు చోటు లేని గడ్డ సమయంలో 'మా సోదరులం'టూ ఆశ్రయం ఇచ్చిన ఆపద్బాంధవులకే చోటు లేని విధంగా ఆ ప్రాంతాలను యూదులతో నింపడం, శాశ్వత నివాసాలు ఏర్పాటు చేయడాన్ని ఏ అగ్రరాజ్యమూ ఇప్పటి వరకూ అడ్డుకోలేదు. పాలస్తీనాకు చెందిన పశ్చిమ గట్టు, గాజా, తూర్పు జెరుసలేం పట్టణ ప్రాంతాల్ని ఆక్రమించిన ఇజ్రాయిల్‌తో సర్దుబాటు చేసుకోమని పాలస్తీనియన్లకు చెబుతారే తప్ప ఆ ప్రాంతాల నుంచి వైదొలగాలని ఇజ్రాయిల్‌కి చెప్పరు. వాటి నుంచి వైదొలిగేందుకు ఇజ్రాయిల్ తిరస్కరించిన కారణంగానే పాలస్తీనియన్లు తమ హక్కుల కోసం సాయుధ తిరుగుబాటుకు ఉద్యుక్తులై వచ్చింది. అలా తమ తన, మాన, ధనాల రక్షణ కోసం ఉద్యుక్తులైన వారిని ప్రపంచ మీడియా ఉగ్రవాదులుగా చిత్రీకరించడం పరమ దుర్మార్గం. ఇప్పటికయినా పాలస్తీనాకు పూర్తి స్థాయిలో గుర్తింపు ఇవ్వడంతోపాటు ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయిల్ వైదొలగితేనే పశ్చిమాసియా శాంతిగా శ్వాస పీల్చుకోగలదు. అందుకు ప్రపంచ శాంతి, కోర హక్కులకు ప్రాధాన్యత ఇచ్చే శ్రేయోభిలాషులందరూ ఇజ్రాయిల్, దాని మద్దతు ఇస్తున్న ఇతర సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఏ అవకాశాన్ని వదలకుండా ఉద్యమించి పాలస్తీనియన్లకు సంఘీ భావం ప్రకటించాలి, మానవత్వాన్ని ఆదుకోవాలి, కాపాడుకోవాలి.

అబ్దుస్సలామ్

2013 January.indd 2 1/2/13 3:42 PM



షేఖ్ ఆబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ

పరివర్తనే పరమావధిగా...

భారతీయులు సంభాషణా చతురులు. వాక్ఛాతురులు. చిన్న పరిచయం చాలు ఇట్టే అల్లుకు పోతారు. పరిచయం లేకపోయినా సరే...దరహాస తోరణాలతో, అభివాద పూ బాణాలతో ఇట్టే ఆకట్టుకుంటారు. వారి ఈ విశేష గుణం కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా వారంటే అభిమానం, నమ్మకం. ప్రజలు మన పట్ల కలిగి ఉన్న ఆ నమ్మకాన్ని, ప్రత్యేకతను కాపాడు కోవాల్సిన బాధ్యత భారత సత్పౌరులుగా మనందరిపై ఉంది.

మనమందరం భారతీయులం. మనమందరం ఒకే దేవుని దాసులం. తెల్లవారయినా, నల్లవారయినా, ధనికులయినా, పేదవారయినా, ముస్లింలయినా, హిందువులయినా, సిఖ్ఖుల యినా, క్రైస్తవులయినా, ఆస్తికులయినా, నాస్తికులయినా, ఆంగ్లేయులయినా, అరబ్బులయి నా అందరం మానవ జాతికి చెందిన వారమే. జగమంతా మన కుటుంబమే. మనమూ ఆ కుటుంబంలో అంతర్భాగమే. మనలో శత్రువుని సయితం కనికరించే ప్రేమతత్వం చిగు రించాలి. సంకుచితత్వం, స్వార్థబుద్ధి అంతరించాలి. అంటరానితనం, అస్పృశ్యత, ఓర్వలేని తనం, జాత్యాహంకారం, వర్గ దురభిమానం, కుల పిచ్చి, వేర్పాటు వాదం వంటి వినాశ కాలు దూరమవ్వాలి. మనలో ప్రతి ఒక్కరు శాంతిసుస్థిరతల వాతావరణం కోసం మన వంతు కృషి చేయాలి. శాంతి విఘాతక శక్తుల్ని, మానవతా ద్రోహుల్ని నిలువరించాలి, నియంత్రించాలి.

నేటి ఈ గణతంత్ర దిన శుభ సందర్భంగా – **'మజ్‌హబ్ నహీ సిఖాతా ఆపస్ మేం బైర్ రఖ్నా' – ఏ మతమయినా బోధించదుగా ద్వేషాన్ని–రూపు దిద్దుదాం భిన్నత్వంలో ఏక త్వాన్ని'** అన్న మాటకు అక్షర రూపాలయి భాసిల్లాలి మనం. మనసా, వాచా, కర్మణా దేశ అభ్యున్నతిని, దేశ సుస్థిరతను, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించాలి మనం. దేశం మనకేమి చ్చిందన్న ఆత్మ నిందను మాని, మనం దేశానికి ఏమివ్వగలమన్న ఆత్మావలోకనం మనలోని ప్రతి ఒక్కరిలో చోటు చేసుకోవాలి. మనం ఎదగాలి, మన దేశాన్ని ప్రగతి పథాన నడిపిం చాలి. దేశ పౌరుల సమస్యల పరిష్కారార్థం నిస్వార్థంగా ముందుకు వచ్చే ఉత్తమ లక్షణాలు గల వారినే మనం మన నాయకులుగా ఎన్నుకోవాలి. ప్రజల ప్రతి **"నిధి"**ని దోచుకుని బ్యాంకుల్లో దాచుకునే ప్రతి వంచకుణ్ణి ప్రతిఘటించాలి. దేశ రక్షణ కోసం, శాంతి విఘాతక శక్తుల నిర్మూలన కోసం పూర్తి చిత్తశుద్ధితో, అంకిత భావంతో మనమం దరం సంఘటితంగా కృషి చేయాలి. వరకట్న దురాచారాన్ని, లంచగొండితనాన్ని పారద్రో లేందుకు ప్రతీన బూనాలి మనం. ధర్మ సంస్థాపనార్థాయ: అవిరళంగా పరిశ్రమించేందుకు కంకణం కట్టాలి మనం.

పిల్లల్ని ప్రేమించాలి మనం. పెద్దలను గౌరవించాలి. స్త్రీలను గౌరవించాలి. గురువులను అభిమానించాలి. మనలో దాతృత్వం, సేవా దృక్పథం మొగ్గలు తొడగాలి. నిరుపేదలను ఆదుకోవాలి. అనాథలకు ఆశ్రయం కల్పించాలి. వితంతువులకు, వికలాంగులకు సహాయ పడాలి. మన ప్రేమను మానవుల వరకే పరిమితం చేయక జీవ కోటి వరకు విస్తరింప జేయాలి. తల్లిదండ్రుల ఎడల, బంధుమిత్రుల పట్ల మంచిగా మెలగాలి మనం.

ఈ శుభ సందర్భంగా ప్రవాసాంధ్రులతో మాదో విన్నపం–తేనెలొలికే తెలుగుని కాపాడు కోవాల్సిన బాధ్యత తెలుగువారిగా మనందరిపై ఉంది. భాషకు మనసును గెలుచుకునే మహత్తర శక్తి ఎలాగయియితే ఉంటుందో, మనసుల్ని, మనుషుల్ని దూరం చేసే, విడదీసే శక్తి కూడా అంతే ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే – మన బలహీనతా సంభాషణే, మన బలమూ సంభాషణే. మాటలు మాత్రమే కలిస్తే అదో మొక్కుబడి సంభాషణ అవు తుంది. హృదయాలు కూడా కలిసినప్పుడే దానికి అందమూ, అర్థమూ, పరమార్థమూ ఉం టుంది. సభా మర్యాదలు ఎంత అవసరమో సంభాషణా మర్యాదలూ అంతే అవసరం.

పోతే, తెలుగు పలుకుల్లో గల మాధుర్యం అనిర్వచనీయం! అవి కొత్తావకాయలా నోరూరు స్తాయి. నేతి అరిసెల్లా ఘుమఘుమలాడుతాయి. రాగి సంగటిలా కమ్మగా ఉంటాయి. సకి నాల్లా కరకరలాడుతుంటాయి. పూర్ణాల్లా నర్మగర్భంగా అనిపిస్తాయి. చల్ల మిరపకాయల్లా భలే చురకలూ పుట్టిస్తాయి. పూత రేకుల్లాంటి తెలుగు పలుకుల సౌరభాలను విశ్వ వ్యాప్తం చేసేందుకు ప్రయత్నిద్దాం రండీ!



2013 January.indd 3 1/2/13 3:42 PM

(నేడు ఇస్లాం మీద, ముస్లింల మీద, ముస్లిం దేశాల మీద జరుగుతున్న విషపూరిత దాడి తెలిసిందే. ప్రపంచమంతా ఇప్పుడు ఇస్లాం గురించి చర్చించుకుంటుందన్న విషయమూ విదితమే. ఒక చేత్తో ఖుర్‌ఆన్, మరో చేత్తో ఖడ్గం ద్వారా ప్రపంచం మీద ఇస్లాం దండెత్తిందన్న వ్యూహాత్మక అపవాదుకి ఇప్పటికీ ఎంతో సమర్థన లభిస్తుంది. అగ్ర రాజ్యాలు వారి స్వయప్రయోజనాల కోసం చేస్తున్న ఆయుధ, సాంస్కృతిక దాడుల నేపథ్యంలో కూడా ప్రణాళికబద్ధంగా దీనికి మరింత విశ్వసనీయతను ఆపాదిస్తున్నారు. మన దేశంలో సయితం అవే విష పవనాలను వ్యాపింపజేసే ప్రయత్నాలు ముమ్మరం గా సాగుతున్నాయి. మానవ జాతి వికాసంలో ఇస్లాం మరియు ప్రవక్త (స) వారి ప్రవ చనాలు పోషించిన కీలక పాత్రను, ముస్లింలు వివిధ రంగాల్లో చేసిన కృషి వల్ల తత్వశాస్త్రం, ప్రకృతి శాస్త్రం, మానవీయ శాస్త్రాల్లో చోటు చేసుకున్న జ్ఞానపరమయిన పురోగతిని విస్మరించి అపార్థాల, అపోహలను విస్తృత స్థాయిలో ప్రచారం చేసి శాంతి శ్రేయాలతో వర్ధిల్లాల్సిన సమాజాన్ని అశాంతి, అలజడులకు గురి చేస్తున్నారు. 'ప్రతి ముస్లిం ఉగ్రవాది కాదు కానీ; ప్రతి ఉగ్రవాది ముస్లిమే' అనే నీచ ప్రవృతికి ఆజ్యం పోస్తున్నారు.

కాబట్టి ఇస్లాం నిర్వహించిన చారిత్రక పాత్రను అర్థం చేసుకోకపోతే ఇస్లాం వ్యతిరేక శక్తులు చేసే దుష్ప్రచారం సఫలమయ్యే అవకాశం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మందికి గర్వకారణమయిన మహోన్నత చరిత్ర దురవగాహనకు, అపోహలకు బలయ్యే ప్రమాదం ఉంది. ఈ విపత్కర పరిస్థితుల్లో నిజధర్మ ధ్వజవాహకులు, మానవతావాదులు ఈ దుష్ప్రచారాల వల్ల భవిష్యత్తులో చోటు చేసుకోబోయే విష మయ పరిణామాలపై దృష్టి సారించాల్సిన అవశ్యకత ఎంతయినా ఉంది. సామ్రాజ్య వాదుల, పాసిస్టుల వంత పాడే నయవంచకుల విష వీచికలకు విరుగుడు కని పెట్టాల్సిన అవసరం ఉంది. శాంతి, సుస్థిర స్థాపనకు నడుం బిగించాల్సి ఉంది. ఆ ప్రయత్నంలో ఓ భాగమే ఈ వ్యాసం.– ఎడిటర్)



ప్రపంచంలోనే ముస్లింలు అత్యధిక సంఖ్యలో ఉన్న రెండో అతి పెద్ద దేశం – మన భారత దేశం. అయినా ఇస్లాంకు ఉన్న విప్లవాత్మక ప్రాముఖ్యాన్ని గుర్తించడంలోనూ, ఆ విప్లవాని కి ఉన్న సాంస్కృతిక పర్యవసానాలను అర్థం చేసుకోవడంలోనూ ఎంతో అవగాహనా రాహి త్యం నెలకొని ఉండటం విషాదకరం. మానవ చరిత్రలోనే ఇది బాగా ఆకర్షించే అధ్యాయం. ఈ అధ్యాయాన్ని నిస్పాక్షికంగా చదవడం ఎంతో అవసరం. ఎందుకంటే ఈ అధ్యాయా నికి ఉన్న శాస్త్రీయ విలువ అత్యంత ఉన్నతమై నది. ముస్లిం దేశాలతో పోల్చితే భారత దేశం లో నివసిస్తున్న ముస్లింల సంఖ్యే ఎక్కువ. అయితే ఈ వాస్తవాన్ని అనేకులు అంతగా పట్టించుకోరు. ఈ యదార్థాన్ని గుర్తించే వారు సయితం చాలా అరుదు. భారత దేశంలో దాదాపు వెయ్యి సంవత్సరాలు పరిపాలించినా నేటికీ ముస్లింలను బయటివారిగానే ప్రచారం చేయడం జరుగుతోంది. దేశ నిర్మాణం బల హీన దశలో ఉన్నప్పుడు ఈ విధమయినటు వంటి చీలికలు చోటు చేసుకోవడం విచార కరం.

అక్బరు పాలనలో జరిగిన అభివృద్ధిని తలచు కుని గర్వపడేవారు, షాజహాను కట్టించిన ముద్ద మనోహర కట్టడాలను గొప్పగా చెప్పు కునేవారు ఆయా చక్రవర్తులు అవలంబించే మతానికి చెందిన వారిని పరాయి వారిగా చూస్తున్నారు. ముస్లింలంతా వారికి పొరుగు వారే. నేటికీ అదే దుస్థితి. ఏళ్ళ తరబడి కొన సాగుతున్న ఈ పక్షపాత ధోరణి జాతీయ ఐక్యతకు దెబ్బతీయడమే కాక, నిస్పాక్షిక చరిత్ర పరిశీలనకు అది పెద్ద అవరోధంగా మారింది. కొన్ని వందల సంవత్సరాలుగా ఈ రెండు మతాల వారు ఒకే దేశంలో ఉంటూ, ఒకే గాలిని పీలుస్తూ, ఒకే నీరుని త్రాగుతూ కూడా పరస్పర సంస్కృతుల గురించి వారి కున్న అవగాహన చాలా స్వల్పం. నాగరికత గురించి తెలిసిన వారు ఇస్లాం గురించి బొత్తి గా తెలియకుండా ఉండరు. ముస్లింల పట్ల కొందరిలో ఉండే చులకన వీరిలో కనిపిం చదు. ఆ కొందరిలో కూడా ఇస్లాం ధర్మ ప్రవక్త బోధన గురించి అవగాహన అంతంత మాత్రమే.

విద్యావంతుడయిన ఒక సామాన్య హిందువుకి ఇస్లాం యొక్క విప్లవాత్మక ప్రాధాన్యత గురించి, అది తీసుకువచ్చిన సాంస్కృతిక మార్పుల గురించి ఉన్న జ్ఞానం పూజ్యమనే చెప్పాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇస్లాంకు వ్యతి రేకంగా ఆజ్యం పోసి మరీ పెంచబడుతున్న భావాలు ఎంతో ప్రమాదకరమయినవి. ప్రమా దకర భావాలను ఎదుర్కోవడం ఎంతో అవ సరం. దేశ సమగ్రత, చారిత్రక వాస్తవాల దృష్ట్యా ఇస్లాం ప్రాముఖ్యత గురించి తెలుసు కోవడం నేటి తక్షణ అవసరం.


గిబ్బన్ గొప్ప చరిత్రకారుడు. మరుపురాని విప్లవాల్లో ఇస్లాం అగ్రశ్రేణికి చెందినదని అతను అభివర్ణించాడు. **ఇస్లాం ప్రపంచ దేశాల్లో చెరగని ముద్ర వేసింది. కొత్త విశ్వా సం అందించిన స్ఫూర్తితో నూతన చైతన్యాన్ని పొంది, అరేబియన్ ఎడారుల నుంచి బయలు దేరిన స్వల్ప సంఖ్య జనులు అప్పట్లో శక్తి వంతమయిన రెండు ప్రాచీన సామ్రాజ్యాలను మట్టి కరిపించడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగి**

2013 January.indd 4 1/2/13 3:42 PM

స్తుంది. ముహమ్మద్ (స) దైవదౌత్య బాధ్యతల ను చేపట్టి, శాంతి సందేశాన్ని ప్రచారం చేసి యాభై ఏళ్ళు గడవక ముందే ఆయన అను యాయులు రెపరెపలాడుతున్న ఇస్లాం సత్య కేతనాన్ని భారత దేశం సరిహద్దుల్లో ఒకప్రక్క, అట్లాంటిక్ సముద్ర తీరాన మరో ప్రక్క విజ యవంతంగా ఎగురవేశారు.
అద్భుతాలు చేసి చూపించడం ద్వారా ప్రతి ప్రవక్త మహిమాన్వితుడనిపించుకుంటాడు. ఈ లెఖ్ఖన తనకు ముందు, వెనకా వచ్చిన ప్రవక్తలందరిలోకెల్లా ముహమ్మద్ (స)ని గొప్ప వాడిగా, అగ్రజుడిగా గుర్తించాల్సి ఉంటుంది. అద్భుతాలెన్నో ఉన్నాయి. కాని ఇస్లాం అత్యంత అద్భుతమయినది. (గిబ్బ్)

అగస్టస్ రోమ్ సామ్రాజ్యం ఏడు వందల యేండ్ల యుద్ధాల ఫలితం. అగస్టస్ తరువాత ట్రాజన్ ఈ సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడు. కాని ఒక శతాబ్ద కాలంలో ఏర్పాటయిన అరబ్ సామ్రాజ్య స్థాయిని రోమ్ సామ్రాజ్యం అందుకోలేకపోయింది. అలేగ్జాండర్ సామ్రా జ్యం ఖలీపాల విశాల రాజ్యంలో ఒక భాగం తో సమానం అంతే. వెయ్యేళ్ల రోమ్ సైనిక శక్తిని నిలువరించిన పర్షియన్ సామ్రాజ్యం పదేళ్ళ కాలంలో ఇస్లామీకరించబడటం చరి త్రలోనే కని విని ఎరుగని సంఘటన. ఈ అద్భుతం ఎలా సాధ్యమయింది? ఈ ప్రశ్న చరిత్రకారులను విస్మయానికి లోను చేస్తుంది. అమాయక ప్రజలపై నెగ్గిన మత ఛాందసంగా ఇస్లాం విజయాన్ని నిందించే వికృత వాదాన్ని నేటి అధ్యనశీల ప్రపంచం తిప్పి కొట్టింది. ఇస్లాం అసాధారణ విజయానికి కారణాలు రెండు. 1) ఇస్లాం ధర్మంలో ఉన్న విప్లవ శక్తి. 2) జన బాహుళ్యాన్ని నడిపించే నిరుపమాన శక్తి. గ్రీకు, రోము, పర్షియా, చైనా, భారత దేశం మొదలయిన ప్రాచీన నాగరికతల పత నానంతర కాలంలో ఏర్పడిన నిరాశ జనక పరిస్థితుల్లో ఇస్లాం ఒక ఆశాకిరణంగా, ఒక ప్రత్యామ్నాయ శక్తిగా, జన వాహినిని నడిపిం చగలిగింది. ఇదే అసలు ఇస్లాం విజయానికి కారణం. పోతే,
ఇస్లాం చారిత్రక విపరీత వాఖ్యానాలు చేసే వారు ఆ ధర్మం సాధించిన సైనిక విజయాల పైనే తమ దృష్టి మొత్తాన్ని కేంద్రీకరిస్తారు. కాని ఇవే ఇస్లాం నిర్వహించిన చారిత్రక పాత్రకు కొలమానం అయితే అది అద్వితీయ చారిత్రక ఘటన అనిపించుకోదు. ఎందు కంటే తాతార్ సిచలయా ప్రాంతాల్లోని ఆట విక జాతుల అఘాయిత్యం యూరప్, ఆసియా మధ్య ప్రాంతాల నుండి పెల్లుబికి పశ్చిమ, దక్షిణ, తూర్పు ప్రాంతాలకు ఎగిసిన అలలకు ఇస్లాం యుద్ధ నీతికి ఎంతో తేడా ఉంది. తీవ్రమయిన విధ్వంసాన్ని సృష్టించిన తర్వాతే అవి సద్దు మణిగాయి. దీనికి పూర్తి విరుద్ధమయినది ఇస్లాం విప్లవం. అది చరిత్ర లో అసాధారణ ఘట్టం. మనిషి సాంస్కృ తిక చారిత్రక ఒక సువర్ణ అధ్యాయం. యుద్ధం దాని లక్ష్యాల్లోని మామూలు భాగం మాత్రమే. శిథిలావస్థలో ఉన్న పాత, పాశవిక వ్యవస్థను కూల్చి గట్టి పునాదుల మీద దాన్ని నిర్మించ డం కోసం. ఆరాచక శక్తులను అంతమొందిం చేందుకు, బర్బరత్వం మెడలు వంచేందుకు ఆ సమరం అవసరమయింది. అయితే ఇస్లాం పరిణామ క్రమంలో ఎన్నో గొప్ప విషయాలు సామాన్య చరిత్ర విద్యార్థికి, అతను ముస్లిం అయినా తెలిసే అవకాశం తక్కువయినప్పుడు ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో సులభంగా ఊహించవచ్చు. ఇస్లాం విప్లవం మానవ జాతిని అనేక ప్రమాదాల నుండి కాపాడింది అంటే నవ్విపోయే వారికీ కొదువ లేదు.
ఇస్లాం చరిత్రను మత పిచ్చిగా, తీవ్రవాద మూకల దోపిడిగా సాధారణంగా కొందరు భావిస్తుంటారు. బాధిత ప్రపంచానికి ఖుర్ ఆన్, ఖడ్గం ఈ రెంటికి మధ్య ఏదో ఒకదాన్ని ఎంచుకోమని బెదిరించిందని వాదించేవారికి, ఇస్లాం అంటే, **'అల్లాహు అక్బర్'** అనే భయా నక అరుపుగా భావించేవారికి ఒక విషయం తెలియదు. తెలిసినా దాటవేస్తారేమో. ఇస్లాం ధర్మ అవలంబీకుల్లో కొందరు ఒక దశలో తార్కిక విషయాల్లో, యుద్ధాల్లో కూరుకుపో యారు అన్న మాటను అంగీకరించినా –వారి ని అతారిక్, అత్తిల, జెన్‌సెరిక్, చెంగీజ్, తామర్‌లేన్ వంటి క్రూరుల నుండి వేరు చేసే ది వారి ఉన్నతమైన వ్యక్తిత్వం, ఆశయంలో స్వచ్ఛత, ధర్మ నిష్ఠతో కూడిన చైతన్యం.

వారి దైవభక్తి కొందరికి మూఢ భక్తిగా కని పించవచ్చు. కాని అందులో కపటత్వం లేదు. లోకజ్ఞానం, ఉదారత వారి భక్తికి మెరుగులు



దిద్దింది. వారి లక్ష్యంలో ఏ కోశానా స్వార్థం కనిపించదు. దైవత్వం అనేది లాలసకు, లోల త్వానికి వేసిన ముసుగుగా వారు భావించ లేదు. మొదటి ధర్మ దళపతి అయిన అబూ బకర్ (ర) కన్నా గొప్పగా పని చేసిన వారూ లేరు. దైవ సైన్యానికి అధిపతిగా అబూ బకర్ జారీ చేసిన మరుపు రాని ఆదేశం ఇలా ఉంది:
"నిస్పాక్షికంగా ఉండు. అన్యాయం చేసిన వారెవరయినా బాగు పడరు. సత్యపరాక్రమ వంతునిగా ఉండు. అసత్యానికి లొంగి బ్రతక డం కంటే సత్యాన్ని బల పరుస్తూ ప్రాణాలర్పిం చడం ఉత్తమం. దయాళువై ఉండు. వృద్ధుల కు, ఆడవారికి, పిల్లలకు హాని కలిగించకు. పళ్ళ చెట్లను, ధాన్యాలను, పశు సంపదను ధ్వంసం చేయకు. శత్రువు అయినా సరే మాట నిలబెట్టుకో. సామాన్య జీవితం నుండి దూరం గా ఉంటున్న వారిని హింసించకు. ఈ అసా ధారణ ఆదేశాన్ని సేనాధిపతి, అతని అనుచరులు చిత్తశుద్ధితో పాటించడం వారి తిరుగు లేని కవాతుకు నిలువుటద్దం.

(సశేషం)

2013 January.indd 5 1/2/13 3:42 PM

మన సమస్యలు తీరాలంటే...?

"ఓ ప్రజలారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు మరియు ఒకే స్త్రీ ద్వారా సృష్టించాము. మరి మీ (పరస్పర) పరిచయం కోసం మిమ్మల్ని వివిధ వర్గాలుగా, తెగలుగా చేశాము. యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువ భయభక్తులు గల వాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువ ఆదరణీయుడు. నిశ్చయంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అప్రమత్తుడు. (దివ్యఖుర్‌ఆన్-49: 13)

ఈ వచనంలో దేవుడు మానవులంతా ఒక్కటే అనే సమగ్ర భావనను బోధిస్తున్నాడు.అయినా, వారిని పరస్పర ఘర్షణకు, పోరుకు పురికొలిపే విషయ మేమిటి? సమాధానమొక్కటే, దేవుడు మనిషికి బోధించిన విశాల దృక్పథాన్ని వదలి తన చుట్టు చిన్న చిన్న గీతలు గీసుకుని ఆ గీతల పరిధిలో ఉన్న వాళ్ళనే తన వాళ్ళుగా భావించసాగాడు. ఈ భావన ఒక్కోసారి వంశం వరకు, ఒక్కోమారు భాష వరకు, ఒక్కోసారి జాతి వరకు వెళ్ళేది. అంతకు మించిన విశాలత దానికి లేదు. ఆ విధంగా పరిమిత స్థాయిలో – వంశం, భాష, జాతి మనుషులను సమైక్య పరచినప్పటికీ మాన వుని అవసరాలు, ప్రయోజనాలు బహు దూరాల వరకు వ్యాపించి ఉన్నాయి. ప్రపంచమే ఒక గదిగా మారిపోయిన నేటి తరుణంలో ఈ ఎల్లలు ఎంత తక్కువ ఉంటే అంతే మంచిది. మా జాతే గొప్ప జాతి అని ఒక జాతీయ నాయకుడు, అంత ర్జాతీయ స్థాయికి చెందిన వ్యక్తి చెబుతున్నాడంటే, ఇతరుల్ని అతను ఏ దృష్టితో చూస్తున్నాడో ఇట్టే అర్థమయిపోతుంది.

ఈ భావన కారణంగా ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ, ప్రతి జాతి భక్తిప్రపత్తుల, ప్రేమాభిమానాల పరిధి, మూర్తి వేర్వేరుగా ఉంటుంది. వారు తమ పరిధిని సమర్థించుకోవటానికి ఇతరుల్ని నిందిస్తారు, ఖండిస్తారు, కించ పరుస్తారు, అవసమైతే నిర్బంధిస్తారు, బహిష్కరిస్తారు, మరీ అవసరమను కుంటే తుదముట్టించేందుకు సయితం వెను కాడరు. ఆసియాకు చెందిన వాడు యూరప్ పట్ల వైషమ్యం ఏర్పరచుకుంటాడు. ఓ దేశంలో మరో దేశానికి స్థానం లేదు. ఒక ప్రాంతానికి మరో ప్రాంతం అంటే గిట్టదు.



వర్గం, వర్ణం, జాతి, ప్రాంతం, రంగు మొదల యిన ఈ వ్యత్యాసాలన్నింటికి పరిష్కారంగా విశ్వ మానవ సోదర భావం ముందుకొస్తుంది. అంటే జాతులన్నీ తమ సమిష్టి ప్రయోజనాల కొరకు పాక్షికాలను ప్రక్కన పెట్టి సమైక్యమయి పోవాలి. వాటి సాధనకు కృషి చేయాలి. తాము ప్రశాంతం గా జీవించాలి. ఇతరుల్ని ప్రశాంతంగా జీవించ నివ్వాలి. అయితే మనిషి ఏర్పరచుకున్న క్రియా జీవితం దీన్ని సమర్థించదు. మనిషి ప్రయోజనా లు అతని సిద్ధాంతాలకు లోబడి ఉంటాయి. మనిషి, యుద్ధం, సంధి, స్నేహం, శత్రుత్వం అన్నీ వ్యవహారాలు సిద్ధాంతాల ఆధారంగానే నెరుపు తాడు. సిద్ధాంతాల్లో వైవిధ్యం ఉంటే ప్రయోజ నాల్లో సమైక్యత సాధ్యం కాదు. కమ్యూనిజాన్ని నమ్మేవాడు పెట్టుబడి దారీతో సంధి ఒడంబడిక చేయడు. జాతి తత్వంలో నమ్మకమున్నవాడు విరోధ జాతి ప్రగతిని సహించడు. సుదీర్ఘ మానవ చరిత్ర ఇచ్చే సాక్ష్యం ఏమిటంటే, ఈ భిన్నత్వం వల్ల మానవుల్లో సదా వివాదాలు, పోరాటాలే సాగాయి. అలాంటప్పుడు అదే వారి మధ్య ప్రేమానురాగాలకు మార్గం కావడం అసంభవం.

ఇక **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అన్న భావన పై వచ నంలా మానవులంతా ఒక్కటే అని నిర్ణయిస్తుంది. అది మానవులందరికీ ఒకే ఆశయాన్ని నిర్ధారిస్తుం ది. మానవులందరి కర్త, స్వామి, ఆరాధ్యుడు, పూజ్యనీయుడు ఒక్కడే అంటుంది. ఆయన భార తీయునికి వేరుగా, చైనీయునికి వేరుగా, రష్యన్‌కు వేరుగా, ఆమెరికన్లకు వేరుగా లక్ష్యాలు నిర్ణయించ లేదు అంటుంది. మానవుని సృష్టికర్త, భువిపై నివసించే ప్రతి వ్యక్తి, ప్రతి వర్గాన్ని తన దాస్యం చేయమని కోరాడు. ఈ నిమిత్తమే ఆయన ప్రవ క్తల్ని ప్రభవింపజేశాడు. గ్రంథాల్ని అవతరింపజే శాడు. వారందరూ ప్రతిపాదించిన విషయం, మనమంతా ఒక్కటే అన్నది ఒకటయితే, **'మనం దరి దైవం ఒక్కడే'** అన్నది మరోకటి. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"భూమ్యాకాశాల సృష్టి, మీ భాషల్లో, రంగుల్లో ఉన్న వైవిధ్యం కూడా ఆయన (శక్తి) సూచనల లోనివే. జ్ఞాన సంపన్నుల కోసం ఇందులో పలు సూచనలున్నాయి". (అర్‌రూమ్: 22)
"ఒక అరబ్బుకి అరబ్బేతరునిపైగానీ, ఒక నల్ల వాడికి తెల్లవాడిపైగానీ ఎటువంటి అధిక్యతా లేదు; దైవభీతితో తప్ప. మీరందరూ ఆదం సంతానమే. ఆదమ్‌ను దేవుడు మట్టితో పుట్టించాడు" అని దైవప్రవక్త (స) అంతిమ హజ్జ్ సందర్భంగా ప్రకటించారు.

'లా ఇలాహ ఇల్లల్లాహ్'కు ఇంతటి మహత్తర శక్తి ఉందా? అంటే దానికి ప్రబల నిదర్శనం నమాజే. ఇకపోతే, ఈ సద్వచన భావమేమంటే, **'అల్లాహ్ తప్ప వేరే ఏ ఇతర ఆరాధ్య దైవం లేదు'.**కలిమా లో ఏముంది? కొన్ని అక్షరాలు మాత్రమే కదా! **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** ఈ అక్షరాలను కలిపి ఉచ్చరిస్తే ఎమయినా మాయ జరుగుతుందా? మనిషి స్థితిగతులే మారిపోవడానికి? తాము చదివే మంత్రానికి భావమేమిటో తెలియకపో యినా, మంత్రం పఠించగానే కొండలు కంపిస్తా యనీ, భూమి బ్రద్దలవుతుందనీ, సముద్రాలు ఉప్పొంగుతాయని కొందరయితే భావించగలరు. ఎందుకంటే, పవర్ అంతా అక్షరాల్లోనే ఉందని, అవి నోటి నుండి వెలువడగానే మాయా ద్వారా లు తెరుచుకుంటాయని వారి విశ్వాసం. కాని ఇక్కడ అలా కాదు. ఇక్కడ అర్థానికి, అంతరాత్మ కు, ఆచరణకే ప్రాధాన్యత. చలి వేసిన వ్యక్తి **'కంబళి, కంబళి' 'దూది పరుపు, దూది పరుపు'** అంటూ కూర్చుంటే ఎలాగయితే చలి బాధ తగ్గదో, సద్వచన విషయంలోనూ అంతే. మనిషి భావాలపై, ఆచరణలపై, తీర్పులపై ఈ సద్వచన ఆధిపత్యం చోటు చేసుకున్నప్పుడే లోక కళ్యాణం సాధ్యం. ఈ సద్వచనాన్ని మనస్ఫూర్తిగా నమ్మిన వ్యక్తి నోట సదా ఈ మాట ఉంటుంది:
"ఆయనే నన్ను సృష్టించినవాడు. మరి ఆయనే నాకు మార్గదర్శకత్వం వహిస్తున్నాడు. ఆయనే నన్ను తినిపిస్తున్నాడు మరియు త్రాపిస్తున్నాడు. నేను జబ్బు పడినప్పుడు ఆయనే నన్ను నయం చేస్తున్నాడు. ఆయనే నన్ను చంపుతాడు. మళ్ళీ తిరిగి బ్రతికిస్తాడు. ప్రతిఫల దినాన ఆయన నా తప్పులను మన్నిస్తాడన్న ఆశ కూడా నాకు ఉంది". (అష్ షుఅరా: 78-82)

ఈ భావన మానవుల మధ్య కుల, వర్ణ, వర్గ, భాష, జాతి దురభిమానాలను అంతమొంది స్తుంది. **'లా ఇలాహ ఇల్లల్లాహ్'**ను త్రికరణ శుద్ధి తో విశ్వసించిన తర్వాత మనిషిలో బూటకపు కీర్తిప్రతిష్టల భేదభావాలు తలెత్తవు. ఒకే దేవుని దాసులం అన్న అత్యుత్తమ భావన, యజమాని-కార్మికులను, పాలితుల-పాలకులను, రాజు-పేద ను ఒకే వరుసలో నిష్ఠగా నిలబడేలా తీర్చిదిద్దు తుంది. మానవులందరినీ సోదరులుగా ఎంచే ఏ సిద్ధాంతమూ ఇస్లాంను మినహా లేదు. అందు వల్లనే ఇస్లాం వైపునకు దృష్టి మరలినప్పుడు మరో వైపు చూసే అవసరం ఏర్పడదు.

(సశేషం)



అబూ రుఖయ్యా

సృష్టి ఆయనదే, పాలనాధికారమూ ఆయనదే.

అల్లాహ్‌యే గగన భువనాలను సృజించాడు. సూర్యచంద్రనక్షత్రాలను సృజించాడు. ఆయనే పగలును ప్రకాశమానమయినదిగా చేశాడు; మనం ఉపాధి కోసం శ్రమించడానికి. ఆయనే రేయిని సృష్టించాడు; మనం విశ్రమించి నెమ్మది పొందడానికి.ఆయన మహాశక్తిమంతుడూ, శుభప్రదుడూనూ. ఆయన ఔన్నత్యానికి హద్దే లేదు. ఆయనలోని శుభాలూ శ్రేయాలకూ పరిమితిలేదు.

అల్లాహ్ కేవలం సృష్టికర్త మాత్రమే కాదు. ఆదేశాలిచ్చే అధికారి కూడానూ. ఆయన ఈ సృష్టిని సృజించి దానితో ఎలాంటి సంబంధం లేకుండా (అల్లాహ్ క్షమించుగాక!) ఎక్కడో మూలన కూర్చోలేదు. అధికారం చెలాయించమని ఈ సృష్టిని ఇతరులకు అప్పజెప్పనూ లేదు. తన అధికార పీఠాన్ని అలంకరించాడు.

విశ్వ వ్యవస్థ నిర్వహణ అంతా స్వయంగా అల్లాహ్ హస్తగతమయి ఉంది. ఆయనే నిఖిల జగతిలోని సర్వస్వాన్ని పరిపాలిస్తున్నాడు.ప్రతి వస్తువూ ఆయన ఆదేశానికి లోబడి ఉంది. అణువణువూ ఆయన ఆజ్ఞలకు కట్టుబడి ఉంది. సృష్టిరాసిలోని ప్రతిప్రాణి భవితవ్యమూ ఆయన ఆదేశంతోనే ముడిపడి ఉంది.

జనుల **'ఆపద్బాంధవుడు'** (ముష్కిల్ కుషా) అల్లాహ్‌యే. వాస్తవానికి ప్రతి మనిషి స్వయంగా నిస్సహాయుడే. ఒకరి ఆపదలను తొలగించే శక్తి అతనికి లేదు. **'ఐశ్వర్యప్రదాత'** (గంజ్ బఖ్ష్) అల్లాహ్‌యే. నిజానికి ప్రతి మనిషి స్వయంగా అగత్యపరుడే. తన వద్ద ఏ నిధులూ లేవు దానం చెయ్యడానికి. అతని అధీనంలో ఏ వస్తువూ లేదు **'దాత'** అనడానికి. **'పేదల పెన్నిధి'** (గరీబ్ నవాజ్) అల్లాహ్‌యే. యదార్థానికి మానవుడు స్వయంగా దీనుడు. అల్లాహ్ కరుణాకటాక్షాలపైనే ఆధారపడి తన జీవన మనుగడను సాగిస్తున్నాడు. లేనివారికి, పేదవారికి అనుగ్రహించడానికి ఏ అధికారమూ కలిగి లేడు.

'పీడితుల మొరలాకించేవాడు' (గౌసె ఆజమ్) అల్లాహ్‌యే. వాస్తవానికి మనిషి స్వయంగా బలహీనుడు. తనకు వచ్చిన కష్టాలను తానే దూరం చేసుకోలేడు. ఒకరి మొరను ఆలకించే శక్తి అతనికి ఎలా ఉంటుంది. అందుకే విశ్వ ప్రభువు అల్లాహ్ సెలవిస్తున్నాడు:**"మీ ప్రభువును మొరపెట్టుకోండి. రోదిస్తూనూ, మౌనంగానూ. నిశ్చయంగా ఆయన హద్దుల్ని అతిక్రమించేవారిని ఏ మాత్రం ఇష్టపడడు".**

(అల్ ఆరాఫ్:55)

"అల్లాహ్ మాత్రమే ఉత్తమమయిన పేర్లకు అర్హుడు. ఆయన్ను ఉత్తమమయిన పేర్లతోనే పిలవండి. ఆయనకు పేర్లు పెట్టే విషయంలో సక్రమ మార్గానికి విముఖులయ్యే వారిని వదలివేయండి. తాము చేస్తూ ఉన్న దానికంతటికీ వారు ప్రతిఫలాన్ని అనుభవించి తీరుతారు".

(దివ్యఖుర్‌ఆన్-7:180)

"మీరు అల్లాహ్‌ను కాదని తమకు నష్టాన్ని చేకూర్చలేని లాభాన్ని అందజేయలేని వాటిని పూజిస్తున్నారు. పైగా వీరు అల్లాహ్ సన్నిధిలో మాకు సిఫారసు చేసేవారు అని అంటారు. ప్రవక్తా! వారికి చెప్పు ఆకాశాల్లోనూ, భూమిలోనూ అల్లాహ్ ఎరుగనటువంటి సమాచారాన్ని మీరు ఆయనకు అందజేస్తున్నారా? ఆయన పరిశుద్ధుడు. వీరు చేసే బహుదైవోపాసనా క్రియలకు అతీతుడు, ఉన్నతుడు".

(యూనుస్:180)

'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్య దైవం లేదు) అని విశ్వసించే ముస్లిం **- అష్‌హదు** (నేను సాక్ష్యమిస్తున్నాను) **అన్ లా ఇలాహ ఇల్లల్లాహ్** (అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్య దైవం లేదు) **వహ్‌దహూ**(ఆయన ఒకే ఒక్కడు) **లా షరీక లహూ** (ఆయన దైవత్వంలో, సృష్టి నిర్వహణలో ఎవరూ భాగస్వాములు లేరు) **లహుల్ ముల్క్** (పాలనాధికారం ఆయనదే) **వలహుల్ హమ్ద్** (సమస్త ప్రశంసలు ఆయనకే సొంతం) **యుహ్‌యీ** (జీవితాన్ని అనుగ్రహించేవాడు ఆయనే) **వ యుమీతు** (మరణాన్నిచ్చే వాడు ఆయనే) **బియదిహిల్ ఖైరు** (శుభాలన్నీ, మేళ్ళన్నీ ఆయన చేతిలోనే ఉన్నాయి) **వహువ అలా కుల్లి షైయిన్ ఖదీర్** (ఆయన ప్రతి వస్తువుపై పూర్తి అధికారం కలిగి ఉన్నాడు) అంటూ పసితనం నుంచే సాక్ష్యమిచ్చే ముస్లిం; నమాజుల్లో **'ఇయ్యాక నఅబుదు వ ఇయ్యాక నస్తయీన్'** (ఓ అల్లాహ్ ఎల్ల వేళలా నిన్నే మేము ఆరాధిస్తాము అన్ని పరిస్థితుల్లోనూ నీ శరణే వేడుకుంటాము) అంటూ దైవసన్నిధిలో ప్రతిజ్ఞ చేసే ముస్లిం; సృష్టికర్త విశ్వప్రభువును కాదని ఆయన దాసుల్ని సృష్టితాలను పేదల పెన్నిధిగా, ఆపద్బాంధవుడిగా, ఐశ్వర్యప్రదాతగా మొరలాలకించేవాడిగా నమ్మి, వారిని అర్థించడమూ వారికి మొర పెట్టుకోవడమూ దైవద్రోహం, నమ్మక ద్రోహం కాదా?

"ఏమిటీ, విశ్వాసుల హృదయాలు అల్లాహ్ జ్ఞాపకం పట్ల, ఆయన అవతరింపజేసిన సత్యం పట్ల మెత్తబడే సమయం ఇంకా వారికి ఆసన్నం కాలేదా? వీరికి మునుపు గ్రంథం ఒసగబడినవారి మాదిరిగా వీరు కాకూడదు. మరి ఆ గ్రంథవహులపై ఒక సుదీర్ఘ కాలం గడచిపోయే సరికి వారి హృదయాలు కఠినమయి పోయాయి. వారిలో చాలా మంది అవిధేయులు". (అల్ హదీద్: 16)

2013 January.indd 7 1/2/13 3:42 PM



ఆరోగ్యం-పరిరక్షణ

- అబుల్ ఇర్ఫాన్

ఆరోగ్యం దేవుడు అనుగ్రహించిన మహా వర ప్రసాదం. దీని పట్ల దేవునికి కృతజ్ఞతలు తెలుపటం ప్రతి మానవుని విధ్యుక్త ధర్మం. దీని పట్ల కృతఘ్నతా భావంతో వ్యవహరిస్తే దేవుడు ఈ వరాన్ని మనిషి నుండి వెనక్కి తీసుకుంటాడు. పైగా ఈ కృతఘ్నత దైవాగ్రహాన్ని ఆహ్వానించినట్లవుతుంది. కాబట్టి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించటం, దాన్ని పరిరక్షించుకోవటం ప్రతి మనిషి బాధ్యత.

ఒకసారి ప్రవక్త సహచరులు ఇద్దరు ఇలా నిర్ణయించుకున్నారు: వారిలో ఒకతను ఇల్లూ వాకిలి వదలిపెట్టి ఎల్లప్పుడూ మస్జిద్‌లోనే మకాం పెట్టి నమాజుల్లో లీనమైపోవాలని నిర్ణయించుకున్నాడు. రెండో అతను ప్రతి రోజూ ఎడతెగకుండా ఉపవాసాలు పాటిస్తూ ఉండాలని భావించాడు. ఈ విషయం దైవప్రవక్త(స)కు తెలిసి ఆ ఇద్దరిలో ఎవరి వైఖరి పట్ల ఆమోదం తెలుప లేదు. పై పెచ్చు ఆయన వారిద్దరినీ ఉద్దేశించి **"మీ మీద మీ శరీరానికి కూడా హక్కుంది"** అని హెచ్చరించారు. దైవప్రవక్త (స) **'ఆరోగ్యం, దాని పరిరక్షణ'** గురించి ఎన్నో హితోక్తులు ప్రవచించారు. తదనుగుణంగా ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడే ఎన్నో పనులు నిర్వర్తించే విషయాలు కూడా సెలవిచ్చారు. కాబట్టి మనం మన ఆరోగ్యాన్ని నిలకడగా వుంచుకోవడం ఎంతో అవసరం.

1) ఆరోగ్యం దేవుని వరం

ప్రఖ్యాత హదీసు గ్రంథం **'నసాయి'**లో ఇలా ఉల్లేఖించబడింది: **"మానవ జాతి క్షేమంగా ఉండేందుకు క్షమాగుణం, వేడుకోలుకంటే శ్రేష్ఠమైనది మరొకటి ఏదీ ప్రసాదించబడ లేదు".**

సృష్టికర్త ప్రసాదించిన ఈ ఘనమైన సహాయ శ్రేష్ఠతలు దైవప్రవక్త (స)కు, ఆయన (స) సహచరుని మధ్య జరిగిన ఓ సంభాషణ ద్వారా తెలుస్తోంది. ప్రఖ్యాత హదీసు గ్రంథం **'నసాయి'**లో ఇలా ఉల్లేఖించబడింది

హజ్రత్ అబూదర్దా (ర) కథనం: నేను దైవ ప్రవక్త (స)తో ఇలా విన్నవించుకున్నాను:'దైవ ప్రవక్తా! నేను ఆరోగ్యంగా ఉన్నప్పుడు దైవానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటాను. కాని ఈ స్థితి నుంచి అనారోగ్యం పాలై పరీక్షకు గురి చేయబడినప్పుడు సహనం వహించే స్థితినే నేను ఎక్కువగా ఇష్టపడతాను." అందుకు దైవప్రవక్త (స) **"నీతోపాటు దైవప్రవక్త కూడా ఆరోగ్యంతో క్షేమంగా వుండటాన్నే కోరుకుంటాడు"** అని అన్నారు. (తిబ్-యె-నబవీ (స) అలావుద్దీన్ అల్‌కుహాల్)

దీన్ని బట్టి ఆరోగ్యం మన సృష్టికర్త ప్రసాదించిన ఎంతగొప్ప వరమో ఆలోచించండి. ఆరోగ్యంగా ఉండటాన్ని దైవప్రవక్త (స) కూడా ఎంతో ఇష్టపడేవారు.అందుకనే దైవప్రియులు, దైవదాసులు ఎల్లప్పుడూ సహనాన్ని, కృతజ్ఞతా భావాన్ని తెలుపటాన్ని తమ పరలోక పెట్టుబడిగా భావించేవారు. వ్యాధికి లోనవడాన్ని ఉన్నత స్థానం అధిరోహించటంగా భావించే వారు. వ్యాధి నుంచి స్వస్థతకు చేరుకోవటానికి వారీ విధంగా దుఆ చేసేవారు: **"కరుణామయుడైన దేవా! మహా ప్రసాదమైన ఈ వ్యాధిని నా కొరకు స్వస్థతా సౌభాగ్యాన్నిచ్చే విధంగా మలచు."**

2) ఆరోగ్యం, తీరిక సమయం

దైవప్రవక్త (స) హితోక్తి: **"ఆరోగ్యం, తీరిక అనేవి మనకు దేవుడు ప్రసాదించిన రెండు వరాలు. ప్రజలు సాధారణంగా వీటి విషయంలో మోసానికి, అజాగ్రత్తకు లోనయి వుంటారు".** (జాదుల్ మఆద్)

ఇంచుమించు ఇదే భావాన్నిచ్చే మరో హదీసులో ఆయన ఇలా చెప్పారు: **"రెండు వరాల విషయంలో సాధారణంగా ప్రజలు అజాగ్రత్తకు లోనయి ఉంటారు. ఒకటి ఆరోగ్యం.రెండవది తీరిక సమయం (సంపద)".**

(సహీహ్ బుఖారీ)

తనకు ఆరోగ్యం ప్రాప్తమైనప్పుడు దేవునికి కృతజ్ఞతలు తెలపడం మనిషి విధ్యుక్త ధర్మం. అలాగే సంపద లభించినప్పుడు పేదరికంలో గడిపిన రోజుల్ని గుర్తుకు తెచ్చుకోవాలి. కలిమి అనేది దేవుడు ప్రసాదించిన గొప్ప కానుక. దీనిపై ఎట్టి పరిస్థితిలోనూ అహంభావానికి, మిడిసిపాటుకు లోను కాకూడదు.

3) ఆరోగ్యం కొరకు ప్రార్థన

ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి 'దైవ ప్రవక్తా (స)! నమాజ్ తరువాత నేను ఏ దుఆ చేయను?' అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) **"ఆరోగ్యంతో క్షేమంగా ఉండటాన్ని కోరుకో"** అని చెప్పారు. ఆ అనుచరుడు మళ్ళీ ప్రశ్నించగా **"నీవు నీ ఇహపరలోకాల్లో సుఖంగా ఉండాలని దేవుడ్ని వేడుకో"** అని సమాధానమిచ్చారు దైవప్రవక్త (స). (తిర్మిజీ)

ఇది పామరుడైన ఒక అనుచరునికి చేసిన ఉపదేశం. కాని హజ్రత్ అబ్బాస్ (ర) లాంటి మేధావి, ప్రముఖుడిక్కూడా దైవప్రవక్త (స) దాదాపు ఇలాగే ఉపదేశించారు. చూడండి: **"అబ్బాస్ (ర)! బాబాయి! మీరు ఇహపర లోకాల్లో క్షేమంగా ఉండాలని దేవుడ్ని వేడుకోండి."** (తిర్మిజీ)

నిజంగా ఆరోగ్యమే అన్నిటికంటే మహా భాగ్యం. అందుకే దైవ ప్రవక్త(స) మాటి మాటికీ ఆరోగ్యం గురించి వేడుకోమని అనుచరులకు ఉపదేశించేవారు. అనుచరుల్లో ఎవరైనా మరో దుఆ కొరకు అభ్యర్థించినా, ఆయన అతనిక్కూడా ఆరోగ్యం గురించే వేడు కొమ్మని చెప్పేవారు. ప్రళయ దినాన దేవుడు దాసునికి ఇహలోకంలో అనుగ్రహించిన ఈ వరం గురించి – **"నేను నీకు శారీరక ఆరోగ్యం ప్రసాదించలేదా?"** అని ప్రశ్నించడం జరుగుతుంది. అని పరలోక చింతనను కలుగజేసేవారు. (తిర్మిజీ)

(ఇంకా ఉంది)

2013 January.indd 8 1/2/13 3:42 PM

పారాచుట్స్

పారాచుట్స్ రూపకల్పన చేసిన వ్యక్తి ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు లియోనార్డో డావిన్సీ. ఈయన 1514లో పారాచుట్స్‌కు సంబంధించిన బొమ్మలను గీయడం ద్వారా పారాచుట్స్‌కు రూప కల్పన చేశారు. 1595లో షాన్ష్ వెరాంజియో అనే ఓ ఇటాలియన్ పారాచుట్స్ ఏ విధంగా పని చేస్తుందో బొమ్మలు వేసి వివరించాడు.

విమానం మొదట కనుగొన్నారా? పారాచుట్స్‌ను మొదట కనుగొన్నారా? అన్న సందేహం కలగడం సహజం. సమాధానం మొదట పారాచుట్స్ కనుగొన్నారు. 1797లో ఆండ్రె జాక్సన్ గార్నిరిన్ బెలూన్ నుంచి బయటకు వచ్చేందుకుగాను పారాచుట్స్‌ను ఉపయోగించారు. పారాచుట్స్ తెగిన గొడుగు మాదిరిగా ఉంటుంది. పారాచుట్ ఆకారంలో ఉన్నందు వలన చుట్టుప్రక్కల ఉండే గాలి పారాచుట్స్ లోపలికి ప్రవేశించదు. గురుత్వాకర్షణ శక్తి ప్రభావం వలన పారాచుట్ క్రిందకు నెట్టబడి అది ప్రయాణించే వేగం తగ్గుతుంది.

మనుష్యుల్ని, వస్తువుల్ని పైనుంచి నెమ్మదిగా క్రిందకు దించేందుకు ఉపయోగపడే పారాచుట్స్‌ను రెండో ప్రపంచ యుద్ధంలో ఉపయోగించారు. వీటిని పారాట్రూప్స్ అంటారు. పెద్ద పెద్ద ట్యూరినులు, సైనిక శకటాలు ఇతరత్రా వాహనాలు వేటినైనా ఈ పారాట్రూప్ దళాలు అవసరమైన చోట సురక్షితంగా దించుతాయి.

ఇది మనిషి ప్రగతికి ప్రతి రూపం. ఇందులో ఏ కాస్త లోపం చోటు చేసుకున్నా వ్యక్తి, సామానుతో పాటు అది నేలకొరుగుతుంది. ఇక్కడ మనం ఒక్క నిమిషం ఆగి దేవుని సృష్టి గురించి ఆలోచించాల్సి ఉంటుంది. ఆయన ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు: **"ఏమిటి, వీరు తమపై రెక్కల్ని చాచుతూ, (ఒక్కొసారి) ముడుచుతూ ఎగిరే పక్షుల్ని చూడటం లేదా? కరుణామయుడయిన (అల్లాహ్) తప్ప వాటిని ఆ స్థితిలో ఎవరూ నిలిపి ఉంచటం లేదు. నిశ్చయంగా ప్రతి వస్తువూ ఆయన దృష్టిలో ఉంది".** (అల్‌ముల్క్: 19)



ఇంటర్‌నెట్ (ఇంద్రజాలం) అంటే?

ఈ రోజు చిన్నాపెద్దా ఎవరిని చూసినా ఇంటర్‌నెట్ (ఇంద్రజాలం) గురించి మాట్లాడుకోవడం మనం గమనిస్తాము. అసలు ఇంద్రజాలం అంటే ఏమిటి? ఇంద్రజాలం ఎప్పుడు ప్రారంభమయింది? అది ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వచ్చింది?

ఇంటర్‌నెట్ అంటే ప్రపంచంలో ఉన్న ఎన్నో నెట్‌వర్క్‌లని అనుసంధానం చేసే వ్యవస్థ. ఇంద్రజాలం 1960లో ప్రారంభమయింది. అమెరికా రక్షణ విభాగం 1960లో భద్రతకు సంబంధించి కంప్యూటర్‌తో ఓ ప్రసార వ్యవస్థను రూపొందించింది. దీనిని ఆర్పానెట్ (ఎ.ఆర్.పి.ఎ.నెట్) అని పిలుస్తారు.

1969 సెప్టంబర్2 తర్వాత నుంచి ఇంటర్‌నెట్ ప్రజలకు అందుబాటులో వచ్చింది. టెలిఫోన్ వ్యవస్థ ద్వారా ఇంటర్‌నెట్‌ను కంప్యూటర్‌కు అనుసంధానం చేస్తారు. కంప్యూటర్ టెలిఫోన్లతో కలిపి పని చేసేందుకు ఉపయోగపడే పరికరాన్ని మోడమ్ అంటారు. కొన్ని ప్రత్యేకమయిన సాఫ్ట్‌వేర్లు డిజిటల్ రూపంలో ఉండే కంప్యూటర్ ఫైల్స్‌ను టెలిఫోన్ లైన్ల ద్వారా ప్రయాణించ గలిగే ఎనలాగ్ సంకేతాల రూపంలోకి మారుస్తాయి. వీటిలో కంప్యూటర్ ఫైల్స్‌ను సంకేతాలుగా మారుస్తాయి. ఈ విధంగా మార్చాక టెలిఫోన్ లైన్ల మీదకు పంపుతారు. ఈ సంకేతాలు మోడమ్ ద్వారా ఎమ్.టి.ఎన్.ఎల్ వంటి ఇంటెర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు చేరుకుంటాయి.

ప్రొఫేసర్ **'క్లెయిన్ రాక్'**ను ఫాదర్ ఆఫ్ ఇంటర్నెట్ అని పిలుస్తారు. ప్రస్తుతం అది ప్రతి వ్యక్తి చేతిలో ఓ సాధారణ వస్తుగా మారిపోయింది. పరికరం అది ఏదయినా స్వతాహా చెడ్డది కాదు. దాన్ని ఉపయోగించే వ్యక్తి మీదే అది ఆధార పడి ఉంటుంది. మనం దాన్ని నిర్మాణం కోసం వినియోగించుకోవాలే గానీ, విచ్ఛిన్నం కోసం కాదు.



బల్బ్ ఎలా వెలుగుతుంది?

ఇది వరకు రోజుల్లో మన ఇళ్ళల్లో లాంతర్లు, కిరోసిన్ దీపాలు వంటివి వెలిగించుకునే వారము. కానీ, ప్రస్తుతం ఒక్క స్విచ్ నొక్కితే చాలు గది అంతా కాంతితో నిండి పోతుంది. అసలు బల్బ్ ఎలా వెలుగుతుంది? బల్బ్‌లో సన్నటి తీగలు ఉంచడం వలన కాంతి వస్తుందా? లేదా మరో విధంగానా?

ఏ పదార్థాన్నయినా ఎర్రగా కాలిస్తే వెలుగు వస్తుంది కదా! బొగ్గు, కర్ర, ఇనుము ఇలా ఏదయినా సరే. ఈ సూత్రం అధారంగానే బల్బ్ పని చేస్తుంది. బల్బ్‌లో ఫిలమెంట్ ఉంటుంది. ఫిలమెంట్ అని పిలిచే సన్నటి వైరులోకి విద్యుత్తును పంపిస్తే అది వేడెక్కుతుంది. వైర్లు ఇతర విద్యుత్ వాహకాలు విద్యుచ్ఛక్తిని తమ వద్దే నిలిచిపోయేలా నిరోధిస్తాయి. ఈ నిరోధక శక్తిని కలిగి ఉండటం వలన ఉష్ణోగ్రత పెరిగి బల్బు బల్బులోని వైరు వేడెక్కుతుంది. ఎప్పుడయితే వైరు దగ్గర ఉష్ణోగ్రత 2200 డిగ్రీల సెంటీగ్రేడ్ చేరుకుంటుందో అప్పుడు బల్బ్ వెలుగుతుంది. బల్బ్ హోల్డర్‌కు రెండు వైర్లను అనుసంధానించడం ద్వారా బల్బ్ నుంచి కాంతి పుట్టించవచ్చు.

ఇది మనిషి ప్రతిభ. అయితే మనిషిని పుట్టించిన ఆ సర్వేశ్వరుని ప్రతిభ ఎటువంటిదో ఒక్కసారి నెమరువేసుకోవాల్సి ఉంటుంది. ఒక గది వెలుగు కోసం ఒక బల్బు అవసరం. ఒక ఇల్లు కోసం కొన్ని బల్బులు, ఒక కార్యాలయం, ఒక ప్రాంతం, ఒక దేశం... ఇలా స్థలం పెరిగేకొద్దీ మరికొన్ని బల్బుల అవసరం పెరుగుతూనే ఉంటుంది. ఎన్ని బల్బులు ఉపయోగించుకున్నా కొన్ని ప్రదేశాల్లో చీకటి ఉండనే ఉంటుంది. కానీ విశ్వ వ్యాప్తంగా ఒకే బల్బు (సూర్యుని)తో ప్రకాశ మానం చేస్తున్నాడు దేవుడు.ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: **"మరి వాటిలో చంద్రుణ్ణి కాంతి మంతంగా చేశాడు. సూర్యుణ్ణి దేదీప్యమానంగా చేశాడు".**

(నూహ్: 16)



2013 January.indd 9 1/2/13 3:42 PM



బంధుత్వ సంబంధాలు

భార్యాపిల్లలు, తల్లిదండ్రులు, అన్నాదమ్ములు, అక్కాచెల్లెళ్లు, అత్తామామలు..ఇలా ఎన్నో బంధాలు అనుబంధాలు...అందరి మధ్య రక్త సంబంధంతో కూడిన అనురాగం, గౌరవం,మమకారం కనిపిస్తుంది. నీది నాది అనకుండా మనది అనే అందమైన ఆప్యాయతతో కూడిన భావన అందరికీ ఉంటుంది. కానీ నేడు ఈ అను బంధాలన్నింటిలో ఎన్నో పరిమితులు, వలయాలు, పొరలు, ఆత్మవంచనలు, స్వార్థాలు, మోసాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు కుటుంబం అది ఎంత పెద్దదయినా, పరస్పరం ఒకే చోట కలిసి ఉన్నా, వేర్వేరుగా నివసిస్తున్నా అందరినీ ప్రేమగా చూసుకుంటూ, అందరి పట్ల గౌరవ భావంతో మసలుకుంటూ బాధ్యతలను సమంగా పంచుకుని అందరిని ఏకత్రాటిపై నడిపించే ప్రయత్నం చేసేవారు. కానీ, నేడు సంబంధాలు, అనుబంధాలకు గల అర్థాలే మారిపోయాయా అన్నట్టుగా ఉంది పరిస్థితి. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంది నేటి స్థితి.

డబ్బు సంపాదనపైనే ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల మానవ సంబంధాల ప్రాముఖ్యత పలుచబడిపోతున్నది.. ఒకే ఇంట్లో నివసించే వారిలో సయితం ఇది నీది, అది నాది అన్న దయనీయ వాతావరణం నెలకొని ఉంది. ఇలా ఎవరికివారు బిజీగా బ్రతికేస్తూ, పిల్లల పెంపకాన్ని అనామకులకు వదిలేసి, పెద్దవారిని వృద్ధాశ్రమాలకు తరలించేస్తున్నారు. ఈ కారణంగా కుటుంబ విలువలు నీరుగారడమేకాక, తల్లిదండ్రులకు, పిల్లలకు, మనవళ్లకు మధ్య ఉండాల్సిన అనుబంధం, అనురాగం, ఆప్యాయతలు కొరవడుతున్నాయి.

ఇక్కడ మనం చెప్పుకోవాల్సిన మరో ముఖ్యమైన విషయం – సమాచార, సాంకేతిక విప్లవం ఈ విశాల ప్రపంచాన్ని చిన్న గదిగా మార్చేసింది. దేశవిదేశాల మధ్య గల వేలమైళ్ల దూరాన్ని చెరిపేసి వారిని నిమిషాల్లో కలిపే పరికరాలు సహజంగానే అందరికీ అందుబాటులో ఉన్నాయి. అయినా దూరాలు తగ్గడం అలా ఉంచితే మరింత పెరుగుతున్నాయి. మానవ సంబంధాలు మెరుగవుతూ కన్నిచినా కుటుంబ సంబంధాలు కుంటు పడుతున్నాయి. ఒకరి మాట ఒకరికి నచ్చడం లేదు. ఒకరి ఉనికిని ఒకరు సహించడంలేదు. ఇంట్లో ఉన్న అత్తగారితో సజావుగా నడుచుకోలేని, సరిగ్గా మాట్లాడని కోడలు ఎక్కడో విదేశాల్లో ఉండే ఫ్రెండ్స్‌తో గంటల తరబడి ముచ్చట్లు చెప్పుకుంటుంది. సమాజ సేవలో ఎంతో మందిని చేరదీసే అత్తగారికి కోడలంటే చిన్న చూపు. చాలా మంది కొత్త పరిచయాల కోసం పడే ఆరాటం, చూపే ఆసక్తి, ఉత్సాహం ఉన్న సంబంధ బాంధవ్యాలు మెరుగు పర్చుకోవడాని కి ప్రయత్నించడం లేదు. నిత్యం కలుసుకునే వ్యక్తులు, స్నేహితులు, రక్త సంబంధీకుల మధ్య ఉండే కమ్యూనికేషన్ గ్యాప్ ఇంటర్‌నెట్‌లో కలి సిన వ్యక్తుల మధ్య ఉండటం లేదు. ఆ వ్యక్తు లు కేవలం మాటలు, రాతల ద్వారానే పరిచ యం. వాళ్లు ప్రత్యక్షంగా కూడా కలిసింది ఉండదు. అయినా వారి మధ్య ఎంతో నమ్మ కం, ఆత్మీయత, ప్రతి బంధం ఇలానే ఉండాలని లేదు. ప్రేమ, నమ్మకం, మోసం అనేవి వాస్తవ ప్రపంచం, మిథ్యా ప్రపంచం రెండింటిలో సమానంగా ఉన్నాయి. అంటే ఇతరులతో మంచి సంబంధాలు కలిగి ఉండ కూడదని కాదు, ప్రాధాన్యత ముందు తన వారికివ్వాలన్నదే. మనం ఇచ్చే ఆ ప్రాధాన్యత దైవాభీష్టం ప్రకారం ఉండాలన్నదే. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"వారి (విశ్వాసుల) వైఖరి ఎలా ఉంటుందంటే, స్థిర పరచండి అని అల్లాహ్ ఆదేశించిన సంబంధాలను స్థిర పరు స్తారు".

(అర్రాద్: 21)

బంధుత్వ సంబంధాల ప్రాముఖ్యత నొక్కి వక్కాణిస్తూ దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్ సమస్త సృష్టిరాసులను సృష్టించిన తర్వాత **'బంధుత్వం'** లేచి నిలబడి – '(దేవా!) నేను బంధుత్వ సంబంధాల విచ్ఛిన్నం నుండి నీ శరణు వేడుకుంటున్నాను' అని విన్నవించుకుంది. దానికి **"అయితే నిన్ను బల పర్చినవాడిని నేనూ బలపరుస్తాను. నీతో తెగత్రెంపులు చేసుకున్నవాడితో నేనూ తెగత్రెంపులు చేసుకుంటాను, ఇది నీకు ఇష్టమే కదా!"** అని అడిగాడు అల్లాహ్. దానికి బంధుత్వం 'ఇష్టమే ప్రభూ!' అని అంది. అప్పుడు అల్లాహ్ **"సరే ఆ భాగ్యం నీకు దక్కుతుంది"** అని దీవించాడు. (ముత్తఫఖున్ అలైహి)

ఈ విషయం పట్ల మరింత స్పష్టత కావాలనుకుంటే ఖుర్‌ఆన్‌లో ఈ వాక్యాన్ని చదవండి: **"ఒకవేళ మీరు విముఖులైపోతే భూమిపై మళ్ళీ కల్లోలాన్ని రేకెత్తిస్తారు. పరస్పరం బంధుత్వాల తెగత్రెంపులు చేసుకుంటారు. అల్లాహ్ శపించి, అంధులుగానూ, బధిరులుగానూ చేసింది ఇలాంటి వారినే".**

(ముహమ్మద్: 22, 23)

దైవ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: **"తన ఉపాధిలో సమృద్ధిని, ఆయుష్షులో పెరుగుదలను కోరుకునే వ్యక్తి తన బంధువులతో సత్సంబంధాలు పెట్టుకోవాలి".**

సత్సంబంధాలు పెట్టుకోవాలంటే అర్థం – మనకు ఉపకారం చేసే బంధువులకు మనం ఉపకారం చేయడం కాదు. మనతో మంచిగా ఉండే వారితో మనం మంచిగా ఉండటం కాదు. ప్రవక్త (స) వారి మాటల్లో చెప్పాలంటే: **"ఒక బంధువు ఉపకారం చేస్తే దానికి బదులుగా ఉపకారం చేసేవాడు నిజమైన బంధుప్రియుడు కాదు. తన బంధువులు తనతో తెగత్రెంపులు చేసుకున్నా వారితో సత్సంబంధాలు కొనసాగించేవాడే సిసలైన బంధుప్రియుడు".**

(బుఖారీ)

మనలో చాలా మంది వారు (తల్లిదండ్రులు, బంధుమిత్రులు) మాకేం చేశారని మేము వారికి చేయడానికి అని అంటుంటారు. వారు ఈ ఉపదేశాల వేలుగులో ఆత్మ సమీక్ష చేసుకోవాలి! ఆలోచించాలి!! ఈ మాటలు ఆడవారికి ఎంతగానయితే వర్తిస్తాయో అంతే మగవారికి సయితం వర్తిస్తాయన్న విషయం గుర్తుంచుకోవాలి!!!

2013 January.indd 10 1/2/13 3:42 PM

మనం మన పిల్లలు

బుష్రా ఫాతిమా

పిల్లల ప్రవర్తన: పిల్లల ప్రవర్తనలో రెండు ప్రధాన తేడాలుంటాయి. వైద్య పరమైన కారణాల వలన వచ్చేవి. పెంపకంలో లోపాల వలన వచ్చేవి. పిల్లలందరూ ఒకేలా ప్రవర్తించరన్న విషయం విదితమే. ఒకే ఇంటి, కటుంబానికి, వంశానికి చెందిన పిల్లల ప్రవర్తనలో సయితం భేదాలుంటాయి. వారిలో కొంత మంది బుద్ధిగా వ్యవహరిస్తే, మరికొందరు చిరాకు కలిగిస్తారు. అలాగే పిల్లల విషయంలో ఏ విధంగా తేడాలుంటాయో, అలాగే పెద్దల విషయంలో, వారి చూసే, అర్థం చేసుకునే దృక్పథంలో తేడాలుంటాయి. మనకు పిల్లలు ఎంత ప్రియమయినప్పటికీ ఒక్కోసారి వారి ప్రవర్తన మనకు కోపాన్ని తెప్పిస్తుంది. ఇలా జరిగినప్పుడు మనం పెద్దవారమనే అహంతో ఎలా పడితే అలా వ్యవహరించకూడదు. విసుగును ప్రదర్శించకుండా సమస్య మూలాల్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

ఒకవేళ మన పిల్లలు నిజంగానే సమస్యాత్మకంగా వ్యవహరిస్తుంటే నిద్రలో ఏమయినా భయంకరమయిన కలలు వస్తున్నాయోమో ఆలోచించాలి. లేదా తోడుగా ఆడుకునే, చదువుకునే పిల్లలతో వారికేమయినా సమస్యలుండవచ్చు, లేకపోతే కొత్తగా తమ్ముడో, చెల్లో ప్రవేశించి మీ మొదటి పిల్లల్లో ఈర్ష్యాద్వేషాల్ని రగిలించి ఉండవచ్చు. అలాగే కొత్త ఇల్లు మారడం, కొత్త స్కూల్, కొత్త టీచర్ మారడం, ఆడుకునే స్నేహితులు మారడం మొదలైనవి కూడా పిల్లల ప్రవర్తనలో మార్పుకు కారణమయ్యే అవకాశం ఉంది.

ముఖ్యంగా పిల్లలు ఏ సమయాల్లో విసుగు ఎత్తించే విధంగా ప్రవర్తిస్తున్నారో గమనించాలి. వారికి బోర్‌గా అన్పించినప్పుడా? ఉద్విగ్నంగా ఉన్నప్పుడా? ఆకలిగా ఉన్నప్పుడా? లేదా నిద్ర వచ్చినప్పుడా? అని గమనించాలి. అదే విధంగా కుటుంబ సమస్యలు, తల్లిదండ్రుల ప్రవర్తన తదితర అంశాలను బట్టి కూడా వారు సృష్టించే సమస్యలు అటూ ఇటుగా ఉండవచ్చు.

పిల్లల శిక్షణ విషయంలో తండ్రి నియమం పెడితే తల్లి దానిని నీరుగార్చకూడదు. ఏది ఎందుకు చేయకూడదో, ఏది తప్పో వివరంగా చెప్పాలేగానీ శాసనాలు జారీ చేయకూడదు.

సరే అన్నది ఎంత వరకు సరైనది?

జీవితంలో అన్నిటికన్నా పెద్ద పెట్టుబడిని సఫలం చేసుకోవాలంటే వారిని ప్రతి తల్లిదండ్రులు వెన్నుముక వ్యక్తిత్వం ఉన్న మనుషుల్లా తీర్చిదిద్దాలి. ఉదాహరణకు చాలా ఇళ్ళల్లో చూడండి. పిల్లలు ఏడుస్తుంటే పెద్దలు **'సరే'** అంటూ వారిని దగ్గరకు తీసుకుంటారు. దీని వల్ల పిల్లలకు తెలియకుండానే వారిలో ఒక విధమయినటువంటి నమ్మకం నాటుకుపోతుంది. అదేంటంటే నేను ఏదయినా పొందాలంటే ఏడ్వాలన్న మాట అనీ!


పిల్లలు తనకు కావాల్సింది పొందడానికి, తను అనుకున్నది సాధించడానికి మనల్ని ఇబ్బంది పెట్టినప్పుడు, ఏడ్చినప్పుడు సాధారణంగా మన నోట వెలువడే **'సరే'** అన్న పదం మన అవివే కానికి, మన బలహీనతకు గర్తుగా నిలుస్తు ంది. అలా **'సరే'** అన్న పేరెంట్స్ దగ్గర నుంచి పిల్లవాడు తాను కోరింది పొందగలుగుతాడు. మన ఈ బలహీనతను తెలుసుకున్న తర్వాత తన ప్రయోజనానికి దాన్ని వాడుకుంటాడు. అంచేత మనం ఆరంభం నుంచే ఆలోచించి **'అవును'** అనో, **'కాదు'** అనో ఖచ్చితంగా చెప్పగలగాలి. అన్న మాట మీద దృఢంగా నిలబడి ఉండాలి. వారు ఏడ్చినా సరే, నేల మీద పడి పొర్లాడినా సరే. అదంతా ఒకసారే జరుగుతుంది. ఎందుకంటే తనక్కావాల్సింది ఎలాగయి నా సాధించి పని కానిచ్చుకునే నైజం ఓ అలవాటుగా మారుతుంది. పెరిగి పెద్దయ్యే వరకు ఇదే భావన అంటి పెట్టుకుని ఉండిపోతుంది.

అంటే దీని ఉద్దేశ్యం – పిల్లలు ఏడిస్తే అసలు దగ్గర తీసుకోవద్దని ఎంత మాత్రం కాదు. ఇక్కడ వారి శిక్షణార్థం ఇలా చేస్తున్నామన్న విషయాన్ని గుర్తు పెట్టుకుంటే మంచిది. ఒక వ్యక్తికిపది మంది పిల్లలుంటే వారిలో ఏ ఇద్దరో మగ్గురో మాత్రమే ప్రయోజకులయ్యారు అంటే కారణం ఏమిటో తెలుసుకోవాలన్నదే మా ఆకాంక్ష.

గిఫ్టుకి లక్ష్యాన్ని జోడించండి

ఈ ప్రపంచంలో ఏదీ ఉచితంగా రాదు. ఈ విషయాన్ని చిన్ననాటే పిల్లలు అర్థమయ్యేలా చెప్పగలగాలి. మా నాన్న మాకు చదువు ఒక్కటే నేర్పించారు అన్న నిరుత్సాహభరిత మాట వారి నోట రేపు రాకుండా జాగ్రత్త పడాలి. లోకం తీరు, లౌక్యం ఆవశ్యకతను వారికి అర్థమయ్యేలా విశద పర్చాలి. ఫలానా పని చేస్తే, లేదా ఫలానా క్లాస్‌లో మంచి మార్కులతో పాసైతే వారికి ఇష్టమయినది తెచ్చి పెడతామని చెప్పడం వల్ల వారిలో మనం చెప్పిన వాటిని సాధించాలన్న పట్టుదల పెరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వారికి ఏది ఫ్రీగా ఇవ్వకూడదు. ఇచ్చే ప్రతి చాక్లెట్, ప్రతి గిఫ్ట్‌కు ఒక అర్థం పంరమార్థం ఉండేలా జాగ్రత్త పాటించాలి. ఉదాహరణకు, వారు ఏం మంచి పనులు చేశారో వాటిని గుర్తు చేసి ఆ మంచి పనికి బహుమతిగా ఇస్తున్నట్టు మనం వ్యవహరించాలి. దీని వల్ల పిల్లల్లో ఏదో సాధించాలనే తపన, ఇన్స్పిరేషన్ కలుగుతాయి. ఇలాంటి తర్ఫీదు వల్ల వారికి రెండు విషయాలు బోధ పడతాయి. 1) ఈ ప్రపంచంలో ఏదీ ఉచితంగా రాదు. 2) నేను చేసిన, చేస్తున్న ప్రతి పనినీ, చర్యను నా తల్లిదండ్రులు గమనిస్తున్నారు. ఈ స్పృహను పిల్లల్లో కలిగించగలిగితే వారి భవిష్యత్తు బంగారుమయమవుతుంది. అప్పుడు వారి జీవితంలో వారి ఉన్నతికి ఆకాశమే హద్దయి నిలుస్తుంది.







జీవన ఇస్లామీయ సరళి

షేఖ్ ముహమ్మద్ బిలాల్

ఇస్లాం ఒక సంపూర్ణ ధర్మం. నిద్ర లేవటం మొదలుకొని రాత్రి నిద్రలోకి జారుకునే వరకు, పుట్టుక మొదలుకొని చావు వరకు లింగ భేదం, వయో భేదం లేకుండా అందరూ తెలుసుకొని ఆచరించ వల సిన ధర్మం. ఒక మనిషి జీవితం అన్ని రంగాల నుండి దాటు కొని పోవాల్సి ఉంటుంది. మనిషి వేసే ప్రతి అడుగు, ప్రతి పని జాగ్రత్తగా చేయవలసి ఉంది. తన జీవితం తన ఇష్ట ప్రకారం కాకుండా తన సృష్టికర్త యజమాని అయిన అల్లాహ్ ఇష్ట ప్రకారం జీవించడంలోనే ఇహ పర సాఫల్యం ఉందన్నది సత్యం. తన జీవితా నికి కావలసిన సూత్రాలు, విధానాలను గ్రహించి తదనుగుణంగా జీవించి అల్లాహ్ ప్రసన్నత పొందడం మానవుని కర్తవ్యం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మౌలానా ముహమ్మద్ యూసుఫ్ ఇస్లాహీ గారు ఉర్దూలో **"ఆదాబె జిందగీ"** అనే పేరుతో ఒక పుస్తకాన్ని రాశారు. గురువర్యులు అబ్దుర్రహ్మాన్ సాబిర్ గారు దాన్ని తెనుగీకరించారు. తెలుగు ఇస్లా మిక్ పబ్లికేషన్ వారు దాన్ని ప్రచురించారు. ఈ పుస్తకం **"ఇస్లామీయ జీవన సరళి"లో** పేరుకు తగ్గట్టుగా ఒక విశ్వాసి నిత్య జీవితం లో ఆచరించ వలసిన అన్ని ఆరాధనా విష యాలు, సామాజిక, నైతిక విలువలు తెలుపడ మైనది. 5 అధ్యాయాలుగా విభజించి ఒక్కొక్క అధ్యాయంలో వివిధ విషయాలను ఆధార పూర్వకంగా తెలుపడమైనది. ప్రత్యేకంగా సభ్యతాసంస్కారాలు, సభా మర్యాదలు,దుఆలు ఇందులో పేర్కొనడం విశేషం.

మొదటి అధ్యాయం: "సభ్యతా సంస్కారం" ఇందులో పరిశుభ్రత, అన్న పానీయాలు, ప్రయాణపు నియమాలు, భయం ఆవహించి నప్పుడు, ఆనందం కలిగినప్పుడు ఆరోగ్యం, అనారోగ్యం కలిగినప్పుడు ఏ విధం గా మసలుకోవాలో తెలుపబడింది.

రెండవ అధ్యాయం: "ఆరాధనానందం" ఇందులో మస్జిద్ మర్యాదలు, వివిధ రకాల నమాజులు వాటి బాధ్యతలు, రమజాన్ మరియు ఉపవాస నియమాలు, హజ్ మరియు విధి విధానాలు, మృతుని పట్ల పాటించాల్సిన మర్యాదలు తెలుపడమైనది. అలాగే ఈ అధ్యాయంలో నీతి, నడవడిక, మర్యాద సంస్కారాల గురించి కూడా విశద పర్చడం జరిగింది.

మూడవ అధ్యాయం: "సుందర సమాజం" ఇందులో రుణం, దాంపత్యం, సంతానం, స్నేహం, ఆతిథ్యం, సభా మర్యాదలు, సలాం దాని పద్ధతు లు మరియు బాధ్యతలు, ఒకరి కొకరు కలుసుకునే పద్ధతి మరియు మర్యాద లు, వ్యాపారం మొదలగు విషయాలను తెలుపడమైనది.

నాల్గవ అధ్యాయం: "ధర్మ సందేశం" ఇందులో బోధకుని పాత్ర – మర్యాదలు – నియమాలు, సంఘ జీవితం, నాయకత్వం విషయాలు న్నాయి.

ఐదవ అధ్యాయం: నిత్యం చేసుకునే దుఆలు, దరూద్‌లు, జుమా ప్రసం గాలు, నిఖా ప్రసంగాలు, ఉత్తమమైన పేర్లు వాటి అర్థాలు మొదలగున వి తెలుపడమైనది.

ఈ పుస్తకంలో ఒక మనిషి ఏ విధంగా తన జీవితాన్ని సరిదిద్దుకొని సమాజంలో ఉత్తముడిగా జీవించాలో అవన్నీ సమగ్రంగా తెలుపడ మైనది. ఈ పుస్తకాన్ని చదివి తెలుసుకొని ఆచరించినట్లైతే సమాజంలో ఉత్తమ జీవితం గడపగలడు మనిషి. పూర్తి సమాజం ఉత్తమ సమాజం కాగలదు. ఈ పుస్తకం అందరికీ అవసరమయిన పుస్తకం. నీతి, నడవ డికలకు ఇస్లాం ధర్మంలో పెద్దపీట వేయడం జరి గింది. చిన్న వయసు నుంచే వీటిని అల వర్చుకున్నట్లైతే రానున్న కాలంలో ఉత్తమ సమా జాన్ని చూడవచ్చు. ముఖ్యంగా ధర్మాన్ని కొత్తగా తెలుసుకుంటున్న వారికి నిజంగా ఈ పుస్తకం ఒక వరమే. గ్రంథకర్త అన్ని కోణాలను దృష్టిలో ఉంచుకొని పొందు పరిచారు.

అల్లాహ్ ఆయన కృషిని స్వీకరించి స్వర్గంలో ఉన్నత స్థానాన్ని ప్రసాదించాలని దుఆ! చేస్తున్నాను. (ఆమీన్)

2013 January.indd 12 1/2/13 3:43 PM

భయమేస్తోంది ప్రవక్తా!

ఒక్క ఉదుటన మహా సాగరం ఎడారి అయిపోయినట్టు
అత్తలు కాళనాగులవుతున్నారు. కట్నాలు కరాళ నృత్యం చేస్తున్నాయి
పురుష పైశాచికం పడతి జీవితాల్తో పరిహాసమాడుతున్నది
గుణ శూన్యుడయిన వాడల్లా నేనో గొప్ప గురువంటూ
కామం నిండిన కళ్ళతో కన్యల జీవితాల్ని శాసిస్తుంటే
భయం వేస్తోంది ప్రవక్తా! భయం వేస్తోంది!!


అశ్లీల సాహిత్యానికి అందె వేసిన హస్తాలంటూ
అతివల ఆత్మాభిమానాన్ని అంగడి వస్తువులా అమ్మేస్తుంటే
వలువలు వీడిన వనితల్ని విశ్వ సుందరీమణులుగా పట్టాలిస్తుంటే
మగువల బ్రతుకులు మృగాల పాలవుతుంటే
భయం వేస్తోంది ప్రవక్తా! భయం వేస్తోంది!!

మానవత్వ తొలి పాఠం ఏంటో తెలియకపోయినా ఫర్వా లేదు
నీతి, న్యాయం, సత్యం, ధర్మం పాటించకపోయినా ఫర్వా లేదు
యుక్తాయుక్తాలోచించక ఇష్టారాజ్యం చేసినా ఫర్వా లేదు
స్వేచ్ఛ కావాలి – అది జంతువు స్వేచ్ఛయినా ఫర్వా లేదు
ఇలా ఉంది ప్రవక్తా! నేటి మా సమాజం

ఈ సమాజంలో –
మానవత్వం మళ్ళీ చిగురించాలంటే
మహిళలు నిండు వలువలు ధరించి నిర్భయంగా
నడవాలంటే స్త్రీకి నిజమైన స్వాతంత్ర్యం దక్కాలంటే
మనుషులు మంచి విలువలతో జీవించాలంటే
జనారణ్యంలో సత్య సుగంధాలు వ్యాపించాలంటే

మళ్ళీ మీ బడిలో చేరి శాంతిశ్రేయాల
ఓనమాలు నేర్చుకోవాలి మానవాళి
మీ ఆదర్శ వచనాల్లో మళ్ళీ మునిగి
చైతన్యవంతం కావాలి జనావళి

సత్యం వద (వధ) అలా వ్రాయాల్నా ఇలా వ్రాయాల్నా
ధర్మం చర (ఛెర) ఎలా దిద్దాల్నా
పొట్టలో చుక్క ఉండాల్నా వద్దా
తెలియక సమతమతమవుతున్నాం ప్రవక్తా!



ఏది ధర్మం? ఏది అధర్మం? చెప్పేదెవరు?

అబ్దుల్లా వస్తాద్ పఠించే సూరాలు దిమాగ్‌లోకి దూరేవి కావు
పిల్లలే కాక పెద్దోళ్ళు కూడా ధ్యానంగా నమాజ్ చదవడానికి
మసలేటోళ్ళు అనేవారికి ఏకేశ్వరోపాసన ఏకాగ్రతతో చేస్తే
కలిగే ఆత్మానందం, మనశ్శాంతి ఎలా ఉంటుందో చెప్పేదెవరు?

అల్‌హమ్‌ద్ సూరా పాంచ్ కలిమా కాదు కదా
పహ్లా కలిమా **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** సారాంశం తెలియదు
ఖుర్‌ఆన్ – హదీసుల్లో ఏముందో తెలీదు అని బాధ పడేవారికి
బాధ్యతతో సత్యాన్ని, కలిమా అర్థాన్ని బోధపడే భాషలో
అనువైన సమయంలో, అనువైన రీతిలో, అనుకూల వాతావరణంలో
అందరినీ ఆకర్షించి అంగీకరింపజేసే విధంగా బోధించేదెవరు?

రామ్ రహీమ్‌ల వ్యత్యాసం (దాసుడు, దేవుడు అన్న
ఇంగిత జ్ఞానం) తెలియని
చేతి వేళ్ళకు తిరుపతి ఉంగరాలు వేసుకొని
గోడల మీద హనుమంతుని పటాలు వ్రేలాడదీసుకొని
మెడలో క్రీస్తు శిలువ లాకెట్టు కట్టుకొని
నెల్లూరు రొట్టెల మొక్కుబడులు చేసుకుని
దైవాదేశాల్ని దివ్యంగా భావిస్తున్నామంటూ
ధర్మాన్ని ప్రాణాధికంగా కాపాడుకుంటున్నామంటూ
సర్వమాన సౌభ్రాతృత్వం సాధిస్తున్నామని
సర్వమత సారాంశం ఒకటేనని చాటుతున్నామని
వేదాంత ధోరణిలో మాట్లాడే ప్రబుద్ధులకు
దైవం ఏమిటో, ధర్మం ఏమిటో తెలిసి వచ్చేలా,
తెలివి వచ్చేలా చెప్పేదెవరు?

హాథ్‌కా మాతమ్ (చేతులతో గుండెలు బాదుకోవడం)
జంజీర్ కా మాతమ్ (గొలుసులతో కొట్టుకోవడం)
బ్లేడ్ కా మాతమ్ (వేళ్ల మధ్య బ్లెడుతో ఛాతిని గాయపర్చుకోవడం)
మన్నత్ కా మాతమ్ (పసికందుల దేహాల్ని గాయ పర్చడం)
మాతం మజ్లిస్‌లు నెత్తుటి స్నానాలు
చూపరులకు విరక్తి కలిగించే వికృత దృశ్యాలు
ధర్మం ఆదేశించని, అనుమతించని పైశాచికాలు
దైవం, దైవప్రవక్త శపించిన నికృష్టాచారాలు
సహాబాలు, తాబయీన్లు ఎరుగని దుస్సాహసాలు
గతంలో ఏ పుణ్యాత్ముడు బోధించని పాపకార్యాలు అనిబోధించేదెవరు?

"మీలో ఒక వర్గం ఖచ్చితంగా ఉండాలి. వారు ప్రజల్ని మంచిని బోధించాలి. చెడుల నుండి వారించాలి" అన్న ఖుర్‌ఆన్ ఆదేశాన్ని
అక్షర రూపం ఇచ్చినప్పుడే సత్య కుసుమం వికసిస్తుంది
శాంతి శ్రేయాలతో ప్రపంచం పరిఢవిల్లుతుంది.

2013 January.indd 13 1/2/13 3:43 PM

ఇస్లామ్ ప్రత్యేకతలు



ఇస్లామ్ విశ్వమానవ ధర్మం:

ఇస్లామ్ బోధనలు ఏ ఒక్క ప్రాంతానికీ, ఏ ఒక్క వర్గానికీ, ఏ ఒక్క సంతతికీ, ఏ ఒక్క కాలానికీ పరిమితం కావు. ఇస్లామ్ విశ్వ మానవ ధర్మం. దీన్ని ప్రపంచ ప్రజల మార్గ దర్శకం కొరకు, తీర్పుదినం వరకు స్థాపించడం జరిగింది.

"(ప్రపంచ) ప్రజలందరిని హెచ్చరించే నిమిత్తం పుర్ఖాన్‌ను తన దాసునిపై అవతరింప జేసిన వాడు ఎంతో శుభసాగరుడు."

(ఫుర్ఖాన్:1)

"మేము సర్వమానవాళి కోసం నిన్ను శుభవార్త అందజేసేవానిగా, హెచ్చరించే వానిగా చేసి పంపాము". (సబా: 28)

"ఇలా పలుకు. ఓ ప్రజలారా! నేను మీ అందరి కోసం వచ్చిన దైవ ప్రవక్తను".

(అల్‌ఆరాఫ్:158)

"ప్రతి ప్రవక్త ప్రత్యేకంగా తన జాతి వైపుకే పంప బడేవాడు. నేను మీ అందరి వైపునకు పంప బడ్డాను. (ముస్లిం, అహ్‌మద్, దారమీ)

ఇస్లామ్ ఎంతో సులభమైన. ఆచరణ రీత్యా చాలా సులువైన ధర్మం. **"అల్లాహ్ మీకు సౌలభ్యం కలుగజేయ గోరుతున్నాడుగాని, మిమ్మల్ని ఇబ్బందుల పాలు చేయాలని కోరటం లేదు."** (అల్‌బఖరహ్ :185)

ప్రవక్త (స) ఉపదేశం: "నిస్సందేహంగా ఈ ధర్మం చాలా సులువైనది". (బుఖారి)

"అల్లాహ్ వద్ద అన్నింటికంటే ప్రియమైన ధర్మం షిర్క్‌కు అతీతమైన సత్కార్యాలు, సౌలభ్యం గల ధర్మం ఇస్లామ్ మాత్రమే."

1) ప్రాంతాల, కాలాల వ్యత్యాసం వల్ల ఇస్లాం ఎంత మాత్రం మారదు:

అంటే విశ్వాసాలు, ఆరాధనలు, అనుమతించ బడినవి, నిషేధించబడినవి. హక్కులు, విధులు ప్రధాన అంశాలు.

అల్లాహ్ ఆదేశం:

"అల్లాహ్ ఆదేశాలు ఎన్నిటికీ మార్చబడవు. ఇదే గొప్ప సాఫల్యం". (యూనుస్ : 64)

2) ఇస్లామీయ ఆదేశాలన్నీ మానవ కళ్యాణం సాఫల్యాల కొరకే:

వీటి వల్ల ధన మాన, ప్రాణాలకు, ధార్మిక తకు, గౌరవాభిమానాలకు రక్షణ లభిస్తుంది.

ప్రవక్త (స) ఉపదేశం:

"ఒక ముస్లిమ్ మరొక ముస్లింను అవమాన పరుచుట, వధించుట మరియు అతని ధనాన్ని కాజేయుట నిషిద్ధం."

(ముస్లిమ్, అబూదావూద్, ఇబ్నెమాజ)

3) ఇస్లామీయ సోదరభావం:

ఇస్లామీయ ఆదేశాలను పాటించటం వల్ల ఆత్మలో పరిశుద్ధత, హృదయంలో స్వచ్ఛత మానవ సమాజంలో క్రమశిక్షణ, ప్రేమ, కరుణ, సమానత్వం, న్యాయం ధర్మం జనిస్తాయి.

అల్లాహ్ ఆదేశం: "విశ్వాసులు పరస్పరం సోదరులవంటి వారు. కనుక మీ సోదరుల మధ్య సంబంధాలు నెలకొల్పండి. అల్లాహ్‌కు భయపడండి." (అల్ హుజురాత్:10)

4) ధార్మిక విద్య అభ్యసించడం ప్రతి ముస్లిం స్త్రీ పురుషుల విధి:

ప్రవక్త ఉపదేశం: "విద్యాభ్యాసం ప్రతి ముస్లిం యొక్క విధి". (ఇబ్నెమాజ 224 సహి.బైహఖీ)

అంటే ధార్మిక ప్రాథమిక విద్య, విశ్వాసాలు, ఆరాధనలు, అనుమతులు, నిషిద్ధాలు, హక్కులు, విధులు.

5) ధార్మిక విద్య ప్రత్యేకతలు:

మహాప్రవక్త (స) ఇలా బోధించారు: **"ఎవరు ధర్మజ్ఞాన సముపార్జన కొరకు దూర ప్రయాణం చేస్తారో అల్లాహ్ వారి కొరకు స్వర్గ మార్గాన్ని సుగమం చేస్తాడు. ఎవరు అల్లాహ్ గృహాల్లోని ఒక గృహంలో చేరి దైవ గ్రంథాన్ని అధ్యయనం చేస్తారో, దాన్ని గురించి చర్చిస్తారో వారిపై అల్లాహ్ సన్నిధి నుండి విశ్వాస ప్రశాంతత అవరిస్తుంది. ఆయన కారుణ్యం వారిని కప్పి వేస్తుంది. దైవదూతల మధ్య అల్లాహ్ వారిని ప్రశంసిస్తాడు".** (మిష్‌కాత్)

6) ధార్మిక పండితులు దైవ ప్రవక్తల వారసులు:

ప్రవక్త ఉపదేశం: "నిస్సందేహంగా ధర్మజ్ఞానులు సందేశహరుల వారసులు".

(తిర్మిజీ, అబూ దావూద్ 3641 సహీహ్)

7) జ్ఞానికి అజ్ఞానికి భేదం:

ప్రవక్త (స) ఉపదేశం: 'ఒక ధర్మజ్ఞానికి ఒక భక్తునిపై గల ప్రాముఖ్యత నాకు మీపై గల ప్రాముఖ్యత వంటిది'. అ తరువాత ఈ ఆయతు పఠించారు. **'అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే దైవభీతి కలిగి ఉంటారు'.**

(తిర్మిజి 2685 సహీ)

8) ఇస్లామ్ పరిపూర్ణ దైవధర్మం:

అల్లాహ్ ఇస్లామ్‌ను పరిపూర్ణమైన ధర్మంగా అవతరింపజేశాడు. ఇప్పుడు ఇందులో ఎటు వంటి హెచ్చుతగ్గులకు తావు లేదు. **"నేను ఈ నాడు మీ కోసం ధర్మాన్ని పరిపూర్ణం చేసాను. మీ కోసం నా అనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. ఇంకా మీ కోసం ఇస్లామ్‌ను జీవన వ్యవస్థగా ఆమోదించాను".**

(అల్‌మాయిదహ్:3)

ప్రవక్త (స) ప్రవచనం:

"మేము ఆదేశించని దాన్ని ఎవరైనా కల్పిస్తే అది రద్దు చేయడబడుతుంది".

(ముత్తఫఖున్ అలైహి)

9) ధార్మికంగా అందరూ ఏకం కావాలి:

ఏకత్వం, దైవదౌత్యం పట్ల ఏకాభిప్రాయం కలిగి ధర్మంపై నిలకడగా ఉండటం ముస్లిం లందరి విధి.

అల్లాహ్ ఆదేశం:

"మీరంతా కలిసి దైవత్రాడును దృఢంగా పట్టుకోండి. వర్గాలుగా విడి పోకండి".

(ఆలి ఇమ్రాన్:103)

10) ముస్లిములు ఒక వర్గం కాదు ఒక సమాజం:

అల్లాహ్ ఏకత్వం, ప్రవక్తల, దైవదూతల పట్ల విశ్వాసం కలిగి ఉన్నందు వల్ల ముస్లిములం దరూ ఒక సమాజంగా పరిగణించ బడతారు. ఈ సంబంధమే వారిని అల్లాహ్ త్రాటిపై ఐకమత్యంగా ఉండేలా చేస్తుంది. అందువల్లే అల్లాహ్ ముస్లిములకు ఉత్తమ సమాజం అనే బిరుదు ఇచ్చి సత్కరించారు.

అల్లాహ్ ఆదేశం:

"ప్రజల కోసం తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరే". (ఆలి ఇమ్రాన్ :110)

మరో ఆదేశం: **"నిస్సందేహంగా మీ సమాజం వాస్తవానికి ఒకే సమాజం నేనే మీ ప్రభువును. కనుక మీరు నన్నే ఆరాధించండి."**

(అల్‌అంబియా : 92)

(ఇంకా ఉంది)

2013 January.indd 14 1/2/13 3:43 PM



విధిరాత నియమాలు

సదాచరణ అంటే వాస్తవానికి అల్లాహ్‌ను, అంతి దినాన్ని దైవ దూతలనూ, దైవ గ్రంథాన్నీ, దైవ ప్రవక్తలనూ విశ్వసించటం. (బఖర:177)

మనిషి చేసే సత్కార్యం, సదాచరణ చిన్నదైనా పెద్దదైనా విశ్వాసం (ఈమాన్) ఉన్న పక్షంలోనే స్వీకృతం అవుతుంది. అన్యదా తిరస్కరించ బడుతుంది. కాబట్టి ఈమాన్ యొక్క మౌలికాంశాల (అర్కానుల్ ఈమాన్)పై దృఢ విశ్వాసం కలిగి ఉండాలి. ఇస్లాం ధర్మం మూడంస్థుల అందమైన మనోహరమైన భవనం అయితే, అందులో మొదటి అంతస్థు అర్కానుల్ ఇస్లాం. షహాదహ్, నమాజ్, జకాత్, రోజా, హజ్జ్ కాగా, రెండవ అంతస్తు అర్కానుల్ ఈమాన్ – అల్లాహ్‌పై, ఆయన దూతలపై, ఆయన గ్రంథాలపై, ఆయన ప్రవక్తలపై, అంతిమ దినంపై, మంచీచెడు విధిరాతలపై విశ్వాసం అవగా, మూడవ అంతస్థు 'ఇహ్సాన్ – అల్లాహ్‌ను నిజంగా చూస్తున్నామంత తాదాత్మ్యంతో తన్మయం చెందుతూ ఆరాధించడం, మనం ఆయన్ను చూడలేక పోయినా ఆయనైతే మనల్ని చూస్తూనే ఉన్నాడన్న భావనతో ఆరాధించడం. ఈ వివరణ హదీసు జిబ్రయీల్‌లో స్వయంగా మహాప్రవక్త (స) వారు ఇచ్చి ఉన్నారు. అందమైన మూడంతస్థుల భవనం అన్న ఉపమానం ఇతర హదీసుల ద్వారా మనకు బోధ పడుతుంది. అర్కానుల్ ఈమాన్‌లోనే ఒకటైన **'విధిరాత'** గురించి చర్చించుకునే ముందు మిగతా అయిదు మౌలికాంశాల్ని క్లుప్తంగా తెలుసుకుందాం!

అల్లాహ్‌ను విశ్వసించటమంటే ఖుర్‌ఆన్ మరియు సహీహ్ హదీసులలో సూచించినట్లుగా ఆయన అస్థిత్వాన్నీ, ఆయన గుణగణాలను, ఆయన అధికారాలను వక్ర భాష్యాలు చెప్పకుండా ఉపమానాలు ఇవ్వకుండా విశ్వసించాలి. ఆయన సహవర్తులుగా, సాటిగా చేసి ఇతరులను నిలబెట్ట కూడదు. ఆయన ఆజ్ఞలన్నింటిని శిరసా వహించాలి. ఆయన హలాల్ అన్నదాన్ని ధర్మంగాను, ఆయన హరామ్ అన్న వాటిని అధర్మంగాను విశ్వసించాలి.

దైవదూతలను విశ్వసించడం అంటే, ఖుర్‌ఆన్ మరియు హదీసులలో అభివర్ణించబడిన విధంగా వారి ఉనికిని సత్యమని ధృవీకరించాలి. అలాగే దైవప్రవక్తలందరి రాకను నిజమని నమ్మాలి. అదే విధంగా మరణానంతరం శిక్షా బహుమానాల దినాన్ని, స్వర్గనరకాలను నమ్మాలి. పై పేర్కొనబడిన మౌలికాంశాలలో ఏ ఒక్కదాన్ని విశ్వసించకపోయినా మనిషి విశ్వాసి (మోమిన్) కాజాలడు. ఈ కోవకు చెందిన ఆరో మౌలికాంశమే మంచీచెడు విధిరాత పట్ల విశ్వాసం. ఈ యదార్థాన్ని విశదపరుస్తూ ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, ఆయన తన ప్రవక్తపై అవతరింపజేసిన గ్రంథా (ఖుర్‌ఆన్)న్నీ అంతకు మునుపు ఆయన అవతరింప జేసిన గ్రంథాలన్నింటినీ విశ్వసించండి.మరి ఎవడైతే అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, అంతిమ దినాన్ని తిరస్కరించాడో వాడు మార్గం తప్పి చాలా దూరం వెళ్ళిపోయాడు".** (అన్ నిసా: 136)

దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: **"మంచీచెడు విధిరాత అల్లాహ్ తరపు నుండి అని నమ్మనంత వరకూ ఏ దాసుడూ మోమిన్ కాలేడు."** ఏ దైవ దాసుడయితే దృఢ చిత్తంతో విధిరాతను విశ్వసిస్తాడో అతను సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతాడు. ఎలాంటి ఉపద్రవాలైన, కల్లోల పరిస్థితులైనా అతన్ని ఏమీ చేయలేవు. అట్టి దృఢ విశ్వాసం గల మోమిన్ పడక మీద చేరి మేను వాల్చగానే అతని నోటి ఈ వాక్యాలు జాలువారతాయి.

"ఓ అల్లాహ్! నేను నా స్వయాన్ని నీకు సమర్పించుకున్నాను.నా సకల వ్యవహారాలన్నింటి నీ నీకే అప్పగించాను. నిన్నే కోరుకుంటూ, నీ ఆగ్రహానికి భయ పడుతూ, నీ అనుగ్రహాన్ని కాంక్షిస్తూ నీ శరణు కోరుకుం టున్నాను. నీవు ఆశ్రయం ఇస్తే తప్ప రక్షణ స్థలం మరొకటి లేదు. నేను నీవు అవతరింప జేసిన గ్రంథాన్ని విశ్వసించాను. నీవు పంపిన ప్రవక్తను మనస్ఫూర్తిగా నమ్మాను".

(బుఖారి, ముస్లిం)

విధిరాత పట్ల విశ్వాసం హృదయంలో నాటుకుపోతే దాని తాలూకు ప్రభావ కాంతులు దేహంపై, శరీరావయవాలపై, ముఖంపై ప్రస్ఫుటమవుతాయి. దాసుని ప్రతి క్రియ, చర్యలోనూ, మాట బాటలోనూ అవి ప్రతిబింబిస్తాయి. విధిరాత పట్ల మనకు పూర్తి నమ్మకం కలగాలంటే దానికి సంబంధించిన పది విషయాల ను ఖుర్‌ఆన్ మరియు హదీసు వెలుగులో తెలుసుకోవాలి. ఆ తర్వాతే విధిరాత రకాల ప్రస్తావన వస్తుంది. అవి:

అల్లాహ్ జ్ఞానం పట్ల విశ్వాసం:

గోచర అగోచర జ్ఞానం, బహిరంగ విషయాల రహస్యాల జ్ఞానం అల్లాహ్‌కు ఉంది. ఆయన జ్ఞాన పరిధిలోకి రాని వస్తువంటూ ఏది లేదు. సృష్టిరాసుల మనసులలో మెదిలే ఆలోచనల కదలిక సవ్వడిని సయితం ఆయన వింటాడు. కటిక చీకటిలో నల్లటి రాయి మీద నడిచే కర్రి చీమను సయితం కంటాడు. జరిగింది,జరుగుతున్నది, జరగబోయేది ప్రతిదీ ఆయనకు తెలుసు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"ప్రళయం ఎప్పుడు వస్తుంది? వర్షం ఎప్పుడు ఎక్కడ కురుస్తుంది? మాతృ గర్భంలో పెరిగే శిశువు స్థితిగతులు, రేపు సంభవించబోయే సంఘటనలు ఏమిటి? మృత్యువు ఎప్పుడు ఎక్కడ వస్తుంది? ఈ అయిదు విషయాల జ్ఞానం అల్లాహ్‌కు తప్ప వేరితరులకు లేదు".**


(బుఖారీ)

(ఇంకా ఉంది)

2013 January.indd 15 1/2/13 3:43 PM

ఐపిసి సిటీ బ్రాంచీ ఆధ్వర్యంలో

ఐపిసి సిటీ బ్రాంచీ ఆధ్వర్యంలో 13-12-2012వ తేది మరియు 20-12-2012వ తేదీన రెండు వేర్వేరు కార్యక్రమాలు సోదరులు శ్రీ నజీబుద్దీన్ గారి సహకారంతో జరిగాయి. అందులో ఒక కార్యక్రమం ఖైతాన్‌లో ఆంధ్ర రాష్ట్రానికి చెందిన కుటుంబాల మధ్య జరిగితే మరో కార్యక్రమం ఫర్వానియా రాయలసీమ హోటల్ పంక్షన్ హాలులో జరిగింది. **'పరస్పర సత్సంబంధాల ప్రాముఖ్యత'** అన్న బేనర్ క్రింద జరిగిన ఈ రెండు కార్యక్రమాల్లో దాదాపు 160 మంది పాల్గొన్నారు. సోదరులు శ్రీ నజీబుద్దీన్ గారి ఖుర్‌ఆన్ పారాయణం మరియు సోదరులు షేఖ్ రియాజ్ గారి గేయాలాపనతో ప్రారంభమయిన ఈ కార్యక్రమాలు ఆద్యంతం ఆహ్లాదంగా సాగాయి. భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనురాగం గురించి, అన్నాతమ్ముళ్ల మధ్య ఉండాల్సిన అనుబంధం గురించి, బంధు మిత్రుల మధ్య ఉండాల్సిన ఆప్యాయత గురించి, ఇరుగుపొరుగు వారి మధ్య కావాల్సిన అవగాహన గురించి ఎంతో చక్కగా, సులభ శైలీలో అందరికీ అర్థమయ్యేలా చెప్పారు ఐపిసి ప్రబోధకులు మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ గారు. అలాగే మనిషిని పుట్టించిన ఆ మాధవుని గురించి కలిగి ఉండాల్సిన జ్ఞానం గురించి కూడా ఆయన నొక్కి వక్కాణించారు. ప్రసంగానంతరం క్విజ్ కార్యక్రమాన్ని శ్రీ సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సోదరుల నుండి లభించిన స్పందన అమేయం. ఇటువంటి మంచి కార్యక్రమాలు మళ్ళీ మళ్ళీ చేయాలని వారు అభిప్రాయ పడ్డారు. **'ఈ కార్యక్రమ నిర్వహణలో చేయూతనందించిన వారందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము'** అన్న నజీబ్ గారి మాటతో ఈ రెండు కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.











షేఖ్ ముహమ్మద్ సలీం జామయి

1) నిన్ను నీవు సరిదిద్దుకో ముందుగా...!

ఒకసారి ఇస్మాయీల్ బిన్ హమ్మాద్ బిన్ అబీ హనీఫ 'బస్రా' నగరపు వీధులగుండా వెళ్తుంటే ఒక వ్యక్తి ఆయనను పలకరిస్తూ ఎక్కడికి బయలుదేరారండీ? అని ప్రశ్నించాడు. ధార్మిక విషయాలలో ఇమామ్ అబూ హనీఫ(ర) గారి నిర్ణయాన్ని దేనినైనా వ్యతిరేకించే వారు దొరికితే వారిని సరిదిద్దాలని వెళ్తున్నానని బదులిచ్చారాయన. అప్పుడా వ్యక్తి ఇలా అన్నాడు: ఇమామ్ అబూ హనీఫా (ర) ఎప్పుడైనా వారి నిర్ణయాలను వ్యతిరేకించేవారిని సరిదిద్దాలని బలవంతం చేశారా? ఇస్మాయీల్ బిన్ హమ్మాద్ బిన్ అబీ హనీఫా **"లేదు"** అని సమాధానమిచ్చారు. చివరి మాటగా ఆ వ్యక్తి ఇలా అన్నాడు **"ముందు మీరు మిమ్మల్ని సరిదిద్దుకోండి"** ఎందుకంటే మీరు ఆయన విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు.

2) మహారాజు మన్సూర్ వద్ద వచ్చి ఒక వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు: **"అయ్యా! మీ సోదరుడు అబ్బాస్ మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాడు. మాకు రక్షణ కల్పించండి!"**

రాజు: నేను మీపై ఉపకారాల వర్షం కురిపిస్తున్నాను. నా తమ్ముడి కీడు నా ఉపకారాలను మించ లేదు. రెండూ సమానంగానే ఉన్నాయి కనుక మీరు ఇలా అభ్యంతరం వ్యక్తం చేయటం సరి కాదన్నారు.


వ్యక్తి: మీ సోదరుని కీడుకి పరిహారంగా మీరు మాకు ఉపకారం చేస్తున్నట్టైతే మరి మిమ్మల్ని నాయకునిగా ఎన్నుకొని మీ ఆదేశాలను శిరసా వహించటం మొదలైనవన్నీ ప్రజలు మీకు ఉచితంగా ఇస్తున్నారన్న మాట.

3) వడ్డీ దైవం ఎందుకు నిషేధించాడు?

జాఫర్ బిన్ ముహమ్మద్ (ర)తో ఒక వ్యక్తి ఇలా ప్రశ్నించాడు **'వడ్డీని అల్లాహ్ ఎందుకు నిషేధించాడు?'** ఆయన ఇలా సమాధానమిచ్చారు **"మానవులలో మానవత్వం కనుమరుగైపోరాదని వడ్డీని అల్లాహ్ నిషేధించాడు".**

4) అల్లాహ్ ఉన్నాడని ఏంటి ఆధారం?

ఒక వ్యక్తి జాఫర్ సాదిఖ్ (ర) వద్దకు వచ్చి ఇలా ప్రశ్నించాడు. వ్యక్తి: "అల్లాహ్ ఉన్నాడు అనటానికి ఏమిటి ఆధారం? అయితే ఈ విశ్వం, పర్వతాలు, మొదలగు వాటిని మాత్రం నాతో చర్చించకు?"



జాఫర్ సాదిఖ్ (ర): నీవు ఎప్పుడైనా సముద్రంలో ప్రయాణించావా?

వ్యక్తి: అవును ప్రయాణించాను.

జాఫర్ సాదిఖ్ (ర): ప్రయాణంలో తీవ్రమైన గాలుల కారణంగా మీ పడవ మునిగిపోతుందేమోనన్న భయానికి గురయ్యారా?

వ్యక్తి: అవును అలా కొన్ని సార్లు జరిగింది.

జాఫర్ సాదిఖ్ (ర): మీరు ప్రయాణించే పడవపై మరియు పడవ నడిపే వ్యక్తులపై మీ నమ్మకం పూర్తిగా నశించిందా?

వ్యక్తి: అవును.

జాఫర్ సాదిఖ్(ర): అప్పుడు మీ మనసులో మిమ్మల్ని ఆదుకునేవాడు ఉన్నాడు అన్న నమ్మకం మీకు ఎవరిపై కలిగింది? ఆ సమయంలో ఎవరి వైపు మీ చూపు మరలిందో ఆయనే అల్లాహ్. చూడండి అల్లాహ్ తన గ్రంథంలో ఇదే విషయాన్ని తెలిపాడు **"సముద్రంలో మీకేదయినా ఆపద కలిగినప్పుడు ఆయన ఒక్కడు తప్ప మీరు పిలిచే వారంతా మటుమాయమైపోతారు కాని ఆయన మిమ్మల్ని రక్షించి నేలపైకి చేర్చినప్పుడు మీరు ఆయన నుండి ముఖం తిప్పుకుంటారు".** (బనీ ఇస్రాయీల్:67)

"మీకేదైనా గడ్డుకాలం దాపురించినప్పుడు మీరు మీ మొరలతో ఆయన వైపునకే పరుగెతడారు". (అన్నహ్ల్ 53)

5) చాణక్యుడు

హమీద్ చాలా తెలివిగా మాట్లాడ గల సమర్థుడు. ఒక రోజు అతను తన పొట్టేలును తీసుకెళ్తుంటే కొందరు వ్యక్తులు అతనితో – బాబూ! ఈ పొట్టేలు ఎంతకు అమ్ముతావని ప్రశ్నించారు. హమీద్ ఇలా చమత్కరించాడు. నేను దీనిని 5 వేలకు కొన్నాను, ప్రస్తుతం ఇది 6 వేలకు పైగా రేటు పలుకుతుంది. దీనంతటి పొట్టేలును ఇతరులు 7 వేలకు అమ్ముతుంటే చుశాను, నాకు కూడా కొందరు 8 వేలు ఇస్తాము ఇవ్వమని అడిగారు. నేను మాత్రం 9 వేలకు కూడా దీనిని అమ్మరాదని నిర్ణయించుకున్నాను. దీని వెల 10 వేలకు తగ్గనీయరాదని నేను అనుకుంటున్నాను, ఎవరైనా 11 వేలు ఇస్తానంటే తప్ప నేను దీనిని అమ్మను.... వస్సలామ్...వస్తాను అంటూ ముందుకు సాగిపోయాడు హామిద్.

6) భాషా చాతుర్యం: సమయస్ఫూర్తితో వ్యవహరించడం కూడా ఒక కళే. ఓ రాజు గారికి ఒంటికన్ను. అయినా, మహా అందగాడినన్న గుడ్డి నమ్మకం అతనిది. ఓ కవిని పిలిపించి తన రాజసాన్ని వర్ణించమని ఆదేశించాడు. **'నువ్వు కరూపివి మహాప్రభో'** అని నిజం చెబితే తలకాయ పుచ్చకాయలా ఎగిరిపోతుంది. పొగడానికేమో మనసు రాదు. మధ్యేమార్గంగా **'ప్రభూ! రాణి గారి కళ్ళలతో కలిపితే మీరు ముక్కంటి గౌరీపతి. ఒక్కరే అయితే ఒంటి కన్ను అసురపతి. ఆ ఒక్క కన్నూ పోయిందా...అంధుడయిన కౌరవపతి!'** అంటూ సవినయంగా సెలవిచ్చాడు. రాజు గారు మురిసిపోయి లక్షీపతిలా వరాలిచ్చారు.

2013 January.indd 17 1/2/13 3:43 PM



గగన తలంతో మాట్లాడే గిరులు. ఉండి ఉండి ఉవ్వెత్తు లేచే సరస్సులు. పొంగి పొరలే సాగరాలు, విత్తుల పొత్తి కడుపుల్లో జీవం పోసుకునే వృక్షాలు, చీకటి కాగితం మీద తోక తో అక్షరాలు చెక్కే మినుగురు పురుగులు, లోతుల్ని లోబర్చుకున్న లోయలు, ఎత్తుల్ని ఎగరేసుకున్న కొండలు, తేనె మధురిమలు అందంగా అందించే తేనెటీగలు, సువాసనల జల్లుల్ని చేరవేసే మలయ పవనాలు. ముసుగు టాకుల్లో దాగిన చెట్ల ముఖాలను మాడ్చే మండుటెండలు, మాడిన చెట్ల చెక్కిళ్ళను సుతారంగా తడిమి మళ్ళీ మెరుగులు దిద్దే పిండి వెన్నెల్లు, ఇరులు, ఝరులు, నింగి, నేలా – అన్నీ ఆ సర్వోన్నత ప్రభువు అల్లాహ్ ప్రసాదించిన అమూల్య వరాలు. అందుగ్గాను మనిషి అల్లాహ్‌కు ఎన్ని కృతజ్ఞతలు చెల్లించుకున్నా తక్కువే.


మనిషి జీవితం ఒక ప్రయాణం! అందులో ఎగుళ్ళూ ఉంటాయి. దిగుళ్ళూ ఉంటాయి. సంతోషాల సప్త రంగుల హరివిల్లులూ వెల్లి విరుస్తాయి. దుఃఖాలూ విరజిమ్ముతాయి. సుఖ దుఃఖాల సమ్మేళనం జీవితం. కర్రి మబ్బుల్లో వెన్నెల ముగ్గులు వేయాలనుకున్నప్పుడు అకస్మాత్తుగా అన్నీ కోల్పోవలసి రావచ్చు. కారు మేఘాలు క్రమ్ముకుని ఏవి కానరాని, పాలు పోని క్లిష్టతర స్థితిలో అనుకోకుండా ఊహించని రీతిలో వరాలొచ్చి ఏకంగా మన ముంగిట వాలొచ్చు. జీవితం అంటేనే పరీక్ష. పరీక్ష నిమిత్తమే జీవితం. సంబరాల్లో, సంతోష సందర్భాల్లో శృతి మించకుండా ఉండటం ఎంత అవసరమో, కష్ట సమయాల్లో, దుఃఖమయ స్థితుల్లో ధైర్యంగా స్థయిర్యంతో ముందుకు సాగడం, మనో బలాన్ని, నిగ్రహాన్ని కలిగి ఉండటం కూడా అంతే అవసరం.

ప్రయాణం, ప్రయత్నం ఆపు చేసి చీకట్లలో బిక్కు బిక్కుమంటూ కూర్చొవడంకన్నా, చీకటి ని నిందిస్తూ కాలయాపన చేయడంకన్నా, అడుగు ముందుకు వేయడం, ఒక దీపం వెలిగించే ప్రయత్నం చేయడమే మంచిది కదా! ఎందుకంటే, నిరాశ నిస్పృహలు మనో బలాన్ని నిర్వీర్యం చేస్తే, ఆశా దృక్పథం మనిషిని నింగికి నిచ్చెన వేసేలా తీర్చిదిద్దుతుంది. **'కష్టాలు కొలిమి లాంటివి. అవి మనల్ని తిప్పి తిప్పి కాల్చి సుత్తి దెబ్బలతో ఓ ఆకారాన్ని ఇస్తాయి. మనలోని తుప్పును వదలగొడతాయి. మనల్ని మరింత క్లీన్‌గా, స్వచ్ఛంగా తయారుచేసి బయట భవిష్యత్తులోని పంపిస్తాయి'** అని నమ్మే వారిలో ఆ నలుగురూ ఉన్నారు.

అది మక్కా నగరం. అక్షరాల..... మక్కా నగరంలో మెరిడాన్ హోటల్ 21వ అంతస్థులో ఉదయం సుందర, సుమధర భోజన పదార్థాలు చక్కగా వడ్డించబడి ఉన్నాయి. ప్రక్కనే ఉన్న ఓ టేబుల్ మీద కూర్చొని ఉన్నారు – లెనిన్, జోసెఫ్, సంజయ్, ప్రేమ్‌సింగ్‌గా మనకు పరిచయమయిన ఆ నలుగురు. అక్కడి నుండి వీనుల విందుగా వినబడుతున్న పవిత్ర **'కాబా'** ప్రతిష్టాలయ ప్రాంగణపు పారాయణాలు, సుమధుర వాణి స్వరఝురులు. కనుల పండుగగా కనబడుతున్న సుభక్తాగ్రేసరుల **'కాబా'** ప్రదక్షిణలు ఒకప్పటి వారి కలల్ని గుర్తు చేస్తున్నాయి.

ప్రపంచం కుగ్రామంగా మారిపోతున్న ఈ ఆధునికంలో వారు సామాన్యులు, స్వాభిమాన ధనులు...మామూలు స్థాయి మనుషులు. ఎక్కడో.....ఒక మారుమూల ప్రాంతంలోని చిన్న పల్లే వాసులు వారు. **"ప్రస్తుతం తాము మక్కా పురిలోని ప్రతిష్టాత్మకమైన ఒక హోటల్‌లో ఉన్నాము"** అన్న ఆలోచన ఉద్వేగపూరితమైన ఉత్తేజాన్ని వారిలో కలిగిస్తోంది. ఎప్పుడో పాతికేళ్ల క్రితం తాము కన్న కల అది! ఆ కల ఇంత అద్భుతంగా వాస్తవ రూపం దాలుస్తుందని వారు కలలో కూడా ఊహించలేదు. అయితే అది అక్షరాల సత్యం! వారు ఆ హోట ల్లో దిగి రెండు గంటలే అయింది. పది నివి షాల్లో పాతికేళ్ళ వెనక్కి వెళ్ళాయి వారి ఆలో చనలు.

2013 January.indd 18 1/2/13 3:43 PM



కర్రి మబ్బుల్లో వెన్నెల ముగ్గులు వేయాలనుకున్నప్పుడు అకస్మాత్తుగా అన్నీ కోల్పోవలసి రావచ్చు. కారు మేఘాలు క్రమ్ముకుని ఏవి కానరాని, పాలు పోని క్లిష్టతర స్థితిలో అనుకోకుండా ఊహిం చని రీతిలో వరాలొచ్చి ఏకంగా మన ముంగిట వాలొచ్చు. జీవితం అంటేనే పరీక్ష, పరీక్ష నిమిత్తమే జీవితం.

వారి పల్లె పేరు **'పసిడి పల్లె'**అని మనం ముందే చెప్పుకున్నాం. ఒక రోజు హజ్జ్ మహారాధన నుండి తిరిగి వచ్చిన ఓ గొప్ప పండితుడు **'ఆ పల్లెకి రాబోతున్నార'**ని విన్నాడు వహీదుద్దీన్. ఆ విషయాన్నే అతను తన నలుగురు స్నేహితులకీ తెలియజేశాడు. ఆయనంటే వహీదుద్దీన్‌కి ఎంతో అభిమానం. ఎప్పట్నుంచో ఆయన్ను కలుసుకోవాలన్నది, కరచాలనం చేయాలన్నది, ఆయన దీవెనలు పొందాలన్నది అతని ఆకాంక్ష! ఆ పండితుని పేరు సలాహుద్దీన్.

'పసిడి పల్లె'కి ఓ ధార్మిక కార్యం కోసం వచ్చిన సలాహుద్దీన్ మౌలానా ఆ ఊరి పిల్లల కోసం మంచి మంచి చాక్లెట్లు కూడా పట్టు కొచ్చారు. పిల్లలకు పప్పు బెల్లాలు, చాక్లెట్లు పంచి పెడుతూ ఆయన ప్రతి పిల్లవానిలో **"నువ్వు జీవితంలో ఏం కాదల్చుకున్నావు?"** అని అడుగుతున్నారు. అక్కడ ఉన్న పిల్లల్లో వయసు పరంగా కాస్త పెద్దవారయినప్పటికీ మౌలానాతో కరచాలనం చేయాలన్న తపన వహీదుద్దీన్‌తో పాటు ఆ నలుగురినీ ఆ పిల్లల సరసన నిలబెట్టింది. మౌలానా మందస్మితం చేస్తూ వహీదుద్దీన్‌ని కూడా అడిగారు. **'భవిష్యత్తులో ఏమవుదామనుకున్నావు?'**అని. అప్పుడు వహీదుద్దీన్ ఆయన కళ్ళల్లోకి సూటిగా చూస్తూ **"మీలాగా సమాజ శ్రేయోభిలాషి కావాలన్నది, మీలాగా హజ్జ్ ఉమ్రాలు చేయాలన్నది నా జీవిత ఆశయం"** అన్నాడు. ప్రక్కనే నిలబడి ఉన్న నలుగురు కూడా ఇతని మాటే మా మాట కూడాను అంటూ తలలూపారు. మౌలానా ఎంతో సౌమ్యత, సుశీలత, సంస్కారం గలవారు. మహా గొప్ప వ్యక్తి. ఆయన మొహం మీద చిరునవ్వు మెరుపు తీగల్లే కదలాడింది. **"అవును నిజమే! ఎందుక్కాకూడదు? అల్లాహ్ సహాయం ఉంటే, మీలో పట్టుసడలని సంకల్పం, అవిరళ కృషి ఉంటే నేనే మిటి, మీరు నాకన్నా పెద్ద వ్యక్తులు కాగలరు"** అన్నారు.

వహీదుద్దీన్ మాట అప్పుడు చాలా మందికీ ఆశ్చర్యం కలిగింది. **'ఓ సామాన్య మౌల్వీసాబ్ కుమారుడికి ఇంత గర్వం పనికి రాదు, పైగా వంత పాడుతూ ఆ నలుగురు'** అని మాటల తూటాలు పేల్చినవారూ లేకపోలేదు. కానీ, అది ఎప్పటి నుంచో బాల్యంలో వహీదుద్దీన్ నాన్నగారు మక్కా మదీనాల ఘనతా విశిష్టత ల గురించి చెప్పినప్పుడు ఈ కోరిక వహీదుద్దీన్‌తోపాటు అక్కడే కూర్చొని కన్నార్పకుండా వింటున్న ఆ నలుగురిలోనూ నాటుకుపోయి మొగ్గలు తొడిగింది. ఇలా అకస్మాత్తుగా **"నువ్వేమవ్వదల్చుకున్నావ్?"** అన్న ప్రశ్న వహీదుద్దీన్‌కి ఉద్దేశించినదే అయినప్పటికీ అదరిలోనూ ఉరకలు వేస్తున్న అభిలాష ఒక్కటే గనక అందరూ తలలూపారు. వారి ఆ మనోకాంక్షే మాట రూపంలో వహీదుద్దీన్ నోట జాలువారింది. కొందరు సుభక్తాగ్రే సరుల చల్లని చూపు కొందరి జీవితాల్లో పెను మార్పుకి కారణమవుతుంది అన్నట్టు ఆ క్షణం దూతలు తథాస్తు అన్న కారణంగానో, మౌలానా దీవెనల ఫలితంగానో తాము ఇప్పుడు మక్కాలోని అత్యంత ఖరీదైన హోటల్‌లో హజ్ ఉమ్రాలు చేసేందుకు వచ్చి దిగి ఉన్నారు. అయితే వహీదుద్దీన్ వారి సరసన లేడు. రెండ్రోజుల తర్వాత తానొచ్చి వారితో కలుసుకుంటానని మాట ఇచ్చి ఉన్నాడు. తను లేకపోవడం వారిని ఎంతగానో కలచి వేస్తున్నది....అదే సమయంలో రేపోమాపో వచ్చి కలుసుకుంటాడన్న కొండంతట నమ్మకం కూడా వారికి ఉంది.

21వ అంతస్థు హోటల్‌లోని కిటికీ వద్ద నిల బడి ఉన్నారు ఆ నలుగురు. అక్కడి నుండి మస్జిదె హరామ్ స్పష్టంగా కనబడుతుంది. కాబా పవిత్రాలయం వైపు సాగర తరంగాల్లా ఉవ్వెత్తుకు లేస్తుంది జనవాహిని. ఉత్సాహం గా ఆ దృశ్య లావణ్యాన్ని ఆస్వాదిస్తున్నారు. ఎప్పుడు హోటల్ దిగి కాబా ప్రాంగణంలో అడుగు పెట్టాలా అని మనసు ఉరకలు వేస్తు ంది. **"మనషులు ఎప్పుడూ ఇలానే ఉండాలి. సాత్వికుల్లా, శాంతి కాముకుల్లా, శ్రేయోభిలాషుల్లా, స్వాభిమానధనుల్లా, దైవభీతి పరుల్లా, ధర్మ పరాయణుల్లా, పరస్పరం సోదరుల్లా - అంటరానితనం, అస్పృశ్యతా భావం, నిమ్నోన్నత ఆలోచనలకు అతీతంగా, అతి సన్నిహితంగా మసలుకోవాలి. ఆధ్యాత్మిక రెక్కలు కట్టుకొని ఐహిక తళుకుబెళుకుల్ని, ఆకర్షణల్ని, అందమైన దాని సోయగాల్ని ఛేదిస్తూ స్వర్గాధిరోహణ చెయ్యాలి. కామం, క్రోధం, మోహం, మదం, మత్సర్యాలను అధిగమించాలి. 'ధర్మో రక్షితే' అన్న సూక్తిని మనిషి అక్షరాలా అమలు పరిస్తే ఈ లోకంలో అశాంతి, అలజడి అల్లకల్లోలం, మారణ హోమాలనేవే ఉండవు"** అని ఆలోచిస్తూ ఉంటే, ఒక రకమైన దివ్యానుభూతి కలుగు తుంది ఆనలుగురికి.

వారందరు కాబా దిశకు సాగిపోతున్నారు! ఓ అల్లాహ్! మాకు కృతజ్ఞత నిండిన హృదయం ప్రసాదించు. నీ నామాన్నే స్మరిస్తూ ఉండేలా గొప్పగా దీవించు స్వామీ! అని లోలోపలే దైవాన్ని వేడుకుంటున్నారు. ఇక కథ సాంతం వారి నోటనే విందాం!

2013 January.indd 19 1/2/13 3:43 PM

ప్రపంచ జీవితమైతే కేవలం ఒక ఆట , ఒక కాలక్షేపం లాంటిది, వాస్తవానికి పరలోక నివాసమే ఉత్తమమైనది, నష్టాన్ని తప్పించుకోగోరే వారికి. అయితే మీరు బుద్ధినుపయోగించరా?
(దివ్యఖుర్‌ఆన్- 6:32)

ప్రపంచ జీవితం ఎలాంటి గంభీర విషయం కాదని, దీన్నేదో కేవలం వేళాకోళంగా తమాషాగా ఏర్పరచడం జరిగిందనీ దీని భావం కాదు. వాస్తవానికి దీని భావమేమిటంటే, పరలోకపు అసలు శాశ్వత జీవితానికి సదృశ్యంగా చూస్తే ఈ జీవితం, ఒక వ్యక్తి కాస్సేపు ఆటవిడుపుగా మానసిక ఉల్లాసానికి కాలక్షేపం చేసి, ఆ తరువాత వాస్తవ గంభీర కార్యకలాపాల వైపునకు మరలేటటువంటిది. దీన్ని కాలక్షేపమని, ఆట అనీ పోల్చడానికి కారణం ఏమిటంటే యదార్థం కనుమరుగయి ఉన్నందు వల్ల అంతర్ దృష్టి లేని మనుషులు, భౌతికారాధకులు అపోహలకు లోనయ్యే కారణాలు అనేకమున్నాయి. ఈ అపోహల్లో పడి జనులు మూల వాస్తవానికి భిన్నంగా చిత్రవిచిత్రమయిన వైఖరులు అవలంబిస్తారు. తత్కారణంగా వారి జీవితం కేవలం ఒక ఆటగా కాలక్షేపంగా రూపొందుతుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఇక్కడ తాను రాజునని ప్రకటిస్తే అతని స్థితి, నాటకాల్లో కృత్రిమంగా కిరీటం ధరించి, సింహాసనాన్ని అధిష్టించి నిజమయిన రాజులానే ఆదేశాలను జారీ చేసే రాజు పాత్రధారికన్నా భిన్నమయింది కాదు. వాస్తవ రాచరికపు వాసన కూడా అతనికి సోకదు. నాటక దర్శకుడు చేసే ఒకే సంకేతంతో అతను పదవీచ్యుతుడవుతాడు. ఖైదు చెయ్య బడతాడు. అతన్ని హత్య చేసే నిర్ణయమూ అవుతుంది.

అచ్చంగా ఇలాంటి నాటకాలే ప్రపంచంలో అన్ని వైపులా నేడు నిజ జీవితంలోనూ ఆడటం జరుగుతోంది. ఒక్కొక్క చోట ఒక వలీ ఒక దేవి ఒక దేవత కొలువు నుండి మనుషుల అవసరాలు తీర్చడం జరుగుతూ ఉంటుంది. కాని నిజానికి అక్కడ అవసరాలు తీర్చే శక్తి అసలు ఎవరికీ ఉండదు. మరో చోట అగోచర విషయాల జ్ఞానమున్నట్టు మహత్యాలు ప్రదర్శిస్తుంటారు. నిజానికి అగోచర విషయాల జ్ఞానం లేశ మాత్రమయినా వారికి ఉండదు. ఇంకొకరు జనులకు ఉపాధి ప్రదాతగా రూపు దాల్చుతారు. పాపం వాస్తవానికి అతను తన ఉపాధికి ఇతరులపైనే ఆధార పడి ఉన్నాడు. మరొకడు తానే ప్రజలకు గౌరవమయినా, పరాభవమయినా ప్రసాదించేవాడినని, లాభనష్టాలు చేకూర్చేవాడినని తలపోస్తాడు, తానే చుట్టప్రక్కల సృష్టి అంతటికీ దైవమయినట్లు తన పెద్దరికాన్ని చాటుకుంటాడు. వాస్తవంగా దాస్యం, పరాధీనతల మచ్చ అతని నుదుట ప్రకటితమవుతూనే ఉంటుంది. అతని దురదృష్టం ఒక్క కుదుపు కుదిపితే పెద్దరికాన్ని నుండి జారి నిన్నటి వరకూ తాను ఎవరిపై తన దైవత్వం చెలాయించాడో వారి పాదాక్రాంతం కాగలడు. మూన్నాళ్ళ ఈ ప్రపంచ జీవితంలో ఆడే ఈ ఆటలన్నీ మృత్యువు ఘడియ ఆసన్నమవగానే ఒక్కసారిగా ఆగిపోతాయి. ఈ ప్రపంచ సరిహద్దుని దాటగానే మనిషి మరో లోకంలో ప్రవేశిస్తాడు. అక్కడ సర్వం వాస్తవికతకు అనుగుణంగా ప్రత్యక్షమవుతుంది. ప్రాపంచిక జీవితంలో మనిషి నిర్మించుకున్న అపోహల తెరలన్నీ అక్కడ తొలిగి పోతాయి. యదార్థం మనిషికి బట్టబయలవుతుంది. తాను తీసుకు వచ్చిన సత్యత ఏమాత్రముందో, అక్కడ నిజ తుల మానంలో దాని బరువు, విలువ ఏ పాటిదో అక్కడే ద్యోతకమవుతుంది. **(ఖుర్‌ఆన్ అవగాహనం - మౌలానా అబుల్ ఆలా మౌదూదీ (ర))**



ఐపిసి తెలుగు విభాగం

షేఖ్ అబ్దుస్సలామ్ ఉమ్రీ (ఖైతాన్ బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 66415927
షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయీ (మన్గఫ్ బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 97258148
షేఖ్ సలీమ్ ఉమ్రీ (వఫ్రా బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 60705344
షేఖ్ అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ (సిటీ బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 6047386
షేఖ్ ముహమ్మద్ బిలాల్ (జహ్రా బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 99928380
సయ్యిద్ అహ్మద్ (జహ్రా బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 50249030
షేఖ్ ముహమ్మద్ సలీమ్ జామయీ
మొబైల్ నెంబరు: 99667860

2013 January.indd 20 1/2/13 3:43 PM

ఐపిసి ఖైతాన్ బ్రాంచీ ఆధ్వర్యంలో

ఐపిసి ఖైతాన్ బ్రాంచీ ఆధ్వర్యాన మౌలానా అబ్దుస్సలామ్ ఉమ్రీ గారి సారథ్యంలో ముహర్రమ్ ఆషురా దినాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తెలుగు న్యూ ముస్లిం సోదరులు, ముస్లిం సోదరులు 15 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే నవంబరు మాసంలో జామియా దారుస్సలామ్ ఉమ్రాబాద్ ఓల్డ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించడం జరిగింది. దాదాపు ఏడు సంవత్సరాలు ఐపిసిలో పని చేసి తన అమూల్యమయిన సేవలు అందించి, **నెలవంక** మాస పత్రికను అభ్యుదయ బాటన నడిపించి, తనదైన శైలితో, కార్య నిర్వహణా ప్రతిభతో పలువురి మన్ననలు అందుకున్న మౌలానా ముజాహిద్ ఖాన్ ఉమ్రీ గారు కువైట్‌ను వదలి వెళుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన అందించిన ధార్మిక సేవల్ని పలువురు సోదరులు, గురువులు శ్లాఘించారు. చదువుకునే రోజుల నుంచి ఆయనది కష్టపడే స్వభావమని మౌలాన ముజీబ్ ఉమ్రీ (విజయవాడ) గారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను మొమెంటో ప్రజెంట్ చేసి సన్మానించడం జరిగింది.



మన్‌హజుల్ అన్బియా ఆధ్వర్యంలో

21-12-2012వ తేదిన మన్‌హజుల్ అన్బియా ఆధ్వర్యంలో సన్‌దూఖ్ ఇఆనతుల్ మర్ద్వా సహకారంతో పలువురు ధార్మిక పండితుల సారథ్యంలో సులైలుల్ జఫ్రా ఎడారిలో ఓ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 700కు పైగా ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో దాదాపు అన్ని బ్రాంచీల నుంచి న్యూ ముస్లిం సోదరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జఫ్రా బ్రాంచీ అధ్యక్షులు శ్రీ సాలిమ్ అల్ హుసైనీ గారు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందనలు తెలియజేశారు. ఇస్లాం స్వీకరించే భాగ్యం లభించిన వారు నిజంగా ధన్యులని, వారు ఇస్లాం ధర్మాన్ని తమ వరకే పరిమితం చేయక పరిచయ, అపరిచయ వ్యక్తులందరికీ చేరవేయాలని కోరారు. తర్వాత ఐపిసి ప్రబోధకులు షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయీ గారు అందరినీ స్వాగత పలుకులతో సాదరంగా ఆహ్వానించగా, ఐపిసి జఫ్రా బ్రాంచీ ప్రబోధకులు షేఖ్ బిలాల్ గారు ఖుర్‌ఆన్ పారాయణం మరియు వ్యాఖ్యానం చదివి విన్పించారు. తర్వాత తెలుగు స్టూడెంట్స్ మధ్య అజాన్ పోటీలు జరిగాయి. అలాగే జుమా నమాజు అనంతరం క్విజ్ కార్యక్రమం కూడా నిర్వహించ బడింది. బహుమతులు పలువురు ధర్మ పండితుల చేతుల మీదుగా విజేతలుగా నిలిచిన న్యూ ముస్లిం సోదరులకు అందజేయ బడ్డాయి. ఆద్యంతం విజ్ఞానదాయకంగా సాగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.











2013 January.indd 21 1/2/13 3:43 PM



2013

సెకనుకి విలువ ఇవ్వలేని వారు నిమిషానికి విలువ ఇవ్వ లేరు. కొన్ని నిమిషాలు వృధా అయితే కొన్ని గంటలు వేస్ట్ అయినట్టే లెక్క. అలాంటి కొన్ని గంటలు కలిస్తే ఒక రోజు! ఒక నెల! ఒక సంవత్సరం!! ఒక జీవితం!!!

మన అదృష్టం కొద్ది రోజుకి 24 గంటలు మాత్రమే ఉన్నాయి. వాటిని సద్వినియోగ పర్చుకోలేకపోతే రోజులు వాటంతట అవే గడిచిపోతూ ఉంటాయి. వెనక్కి తిరిగి చూసుకుంటే చేయవలసిన పనులు ఎన్నో మిగిలి ఉంటాయి. పూర్తి చేసిన పనులు మాత్రం కొన్నే కనబడతాయి.
ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మహా గొప్ప అనుగ్రహాలు రెండు. అత్యధిక శాతం మంది ప్రజలు ఈ రెంటిని గురించి నిర్లక్ష్యానికి, ఏమరుపాటుకు గురై ఉంటారు. వాటిలో ఒకటి - ఆరోగ్యం అవగా, మరొకటి తీరిక సమయం". (బుఖారీ)

జనవరి

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30	31		

ఫిబ్రవరి

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28		

మార్చి

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30
31						

ఎప్రిల్

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30				

మే

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
			1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30	31	

జూన్

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
						1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29
30						

జులై

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30	31			

ఆగస్టు

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
				1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	31

సెప్టంబరు

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
1	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24	25	26	27	28
29	30					

అక్టోబరు

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30	31		

నవంబరు

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30

డిశంబరు

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
1	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24	25	26	27	28
29	30	31				

2013 January.indd 22 1/2/13 3:43 PM